www.samasamajam.in

# సమ సమాజం

తెలుగు దిన పత్రిక

తెలంగాణ | శని వారం, 16 జూలై 2022 | ఎడిటర్ : గోసుకొండ పృధ్విరాజు | సంపుటి - 07, సంచిక-103 | పేజీలు - 4 వెల రూ. 5/-

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak

## టిఆర్ఎస్ హ్యాట్రిక్ విజయం సాధిస్తుంది

- మళ్లీ కెసిఆర్ నేతృత్వంలోనే విజయం సాధిస్తాం
- విపక్షాలే టిఆర్ఎస్ విజయాన్ని అంగీకరిస్తున్నాయి: కెటిఆర్



**హైదరాబాద్, జూలై 15 (సమ సమాజం):** ముఖ్యమంత్రిగా కేసీఆర్ హ్యాట్రిక్ ఖాయం.. కాంగ్రెస్, బీజేపీ సర్వేలే ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయని టీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ తెలిపారు. విపక్షాలే అంగీకరిస్తున్నప్పుడు ఇంక అనుమానాలు ఎందుకని ప్రశ్నించారు. రాబోయే ఎన్నికల్లో టీఆర్ఎస్ గెలుస్తదని ప్రత్యర్థులు కూడా ఒప్పుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. ఎనిమిదేండ్ల పాలన తర్వాత ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందన్నారు. బలంగా ఉన్న నేతలను పార్టీ కలుపుకొని పోతుందని స్పష్టం చేశారు. టీఆర్ఎస్ ఒక్క పార్టీయే రాష్ట్రం అంతటా ఉందన్నారు. టీఆర్ఎస్ పార్టీకి 90కి పైగా స్థానాలు వస్తాయని తమ సర్వే చెబుతుందని కేటీఆర్ పేర్కొన్నారు. మూడోసారి కూడా కెసిఆర్ అధికారంలోకి వస్తారని అన్నారు. షెడ్యూల్ ప్రకారమే 2023లో ఎన్నికలు జరుగుతున్నాయని కేటీఆర్ స్పష్టం చేశారు. వాళ్లు తేదీ ప్రకటిస్తే అసెంబ్లీ రద్దు చేస్తామని సీఎం చెప్పారు. కానీ బీజేపీ నుంచి స్పందన లేదన్నారు. అన్ని వ్యవస్థలతో పాటు ఈసీ కూడా కేంద్రం చేతిలో ఉందని ఆయన ధ్వజమెత్తారు. కేసీఆర్ ఎవరికీ బెదరడు.. లొంగడు అని కేటీఆర్ తేల్చిచెప్పారు. వాపును చూసి కొందరు బలుపు అనుకుంటు న్నారు. బీజేపీ డబుల్ ఇంజిన్ మోదీ, ఈడీ అని ఎద్దేవా చేశారు. మంచి పనులతో మనసులు గెలవడం బీజేపీకి తెలియదు. రాహుల్ గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ చచ్చిపోయిందన్నారు. సిరిసిల్లకు రాహుల్ వస్తే స్వాగతిస్తాం.. వచ్చి నేర్చుకోమనండి అని కేటీఆర్ సూచించారు. దేశంలో ఎక్కడా లేని సంక్షేమ పథకాలు తెలంగాణలో అమలవుతున్నాయని గుర్తు చేశారు. రైతులపై కేంద్రం కక్ష కట్టినట్లు వ్యవహరి స్తోందని మండిపడ్డారు. కొత్త రేషన్ కార్డులు, కొత్త పెన్షన్లు ఇస్తామని స్పష్టం చేశారు. ధరణి సమస్యలను పరిష్కరిస్తామని కేటీఆర్ తెలిపారు. దీనిపై అనవసర భాండాలు వేస్తున్నారని అన్నారు.

# ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలు ముమ్మరం

రంగంలోకి హెలికాప్టర్‌తో పాటు రెస్క్యూ టీమ్‌లు ■ సిఎం కెసిఆర్ ఆదేశాలతో సిఎస్ సోమేశ్ చర్యలు



**హైదరాబాద్, జూలై 15 (సమ సమాజం):** భారీ వర్షాలతో గోదావరి ఉగ్రరూపందాల్చి ప్రవహిస్తున్న ప్రకృతి విపత్తు నేపథ్యంలో ఇప్పటికే సీఎం కేసీఆర్ ఆదేశాలతో ముంపు ప్రాంతాల్లో రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాలుగా సహాయక, రక్షణ చర్యలు చేపట్టింది. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు స్థానిక, మంత్రులు, ప్రజా ప్రతినిధులు క్షేత్రస్థాయిలో ఉంటూ ప్రభుత్వ యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూ ప్రజలను రక్షించే చర్యల్లో భాగస్వాములవుతున్నారు. ఈ నేపథ్యంలో ఊహించని వరదలకు జలమయమవుతున్న లోతట్టు ప్రాంతాల్లో ప్రజారక్షణ చర్యలు చేపట్టేందుకు కావాల్సిన ఎన్డీఆర్ ఎఫ్ సిబ్బందిని, రిస్క్యూటీంలతో పాటు హెలీకాప్టర్లను అందుబాటులోకి తేవాలని సీఎం కేసీఆర్ ఇప్పటికే ఆదేశించారు. ఈ మేరకు అప్రమత్తంగా ఉంటూ వరదల్లో చిక్కుకున్న వారిని రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం కాపాడుతున్నదని తెలిపారు. ఈ నేపథ్యంలో భద్రాచలం లో క్షేత్రస్థాయిలో సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్న ఖమ్మం జిల్లా స్థానిక మంత్రి పువ్వాడ అజయ్ అభ్యర్ధన మేరకు హెలీకాప్టర్‌ను అందుబాటులో ఉంచాలని సీఎం కేసీఆర్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్ ను ఆదేశించారు. దాంతో పాటు వరద బాధితులను రక్షించేందుకు సహాయ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఉపయోగ పడే లైఫ్ జాకెట్లు, తదితర రక్షణ సామగ్రిని ఇప్పటికే తరలించారని, అదనంగా మరిన్నింటిని తరలించాలని సీఎం ఆదేశించారు. భద్రాచలం వద్ద గోదావరి ప్రమాదకర స్థాయికి చేరుకోవడం తో వరద పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని

2వ

## ఎంపి అర్వింద్ పై దాడి

ఆరా తీసిన అమిత్ షా



**నిజామాబాద్, జూలై 15 (సమ సమాజం):** నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఫోన్ చేశారు. శుక్రవారం జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం ఎర్దండి సమీపంలో ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరిని పరిశీలించేందుకు వచ్చారు. ఈ సమయంలో కొంతమంది 'అర్వింద్ గో బ్యాక్' అని నినాదాలు చేస్తూ ఆయన ఉన్న కారు అద్దాలను పగులగొట్టి అర్వింద్‌పై దాడికి దిగారు. ఈ దాడిపై కేంద్ర హోంమంత్రి ఆరా తీశారు. దాడిపై అర్వింద్ మాట్లాడుతూ.. 'ప్లాన్ ప్రకారమే తనపై దాడి జరిగింది, కార్యకర్తలపైనా దాడులు జరుగుతున్నాయి. బీజేపీ నేతలు, కార్యకర్తలే లక్ష్యంగా అధికార టీఆర్ఎస్ దాడులు చేస్తోంది. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో ఎక్కడ తిరిగిన దాడులు జరపాలని టీఆర్ఎస్ నాయకత్వం ఎమ్మెల్యేలకు ఆదేశాలిచ్చింది. దాడి వెనక టీఆర్ఎస్ ఎమ్మెల్యే విద్యాసాగరరావు ఉన్నారు అని ఎంపీ అర్వింద్ అమిత్ షాకు ఫోన్లో తెలిపారు.

## అసెంబ్లీ రద్దు చేసే దమ్ము కేసీఆర్‌కు ఉందా..?

- క్షణంలో రద్దు చేయండి.. మేము ఎన్నికలకు సిద్ధం
- పీసీసీ మాజీ చీఫ్, ఎంపీ ఉత్తమ్ కుమార్ రెడ్డి



**హైదరాబాద్, జూలై 15 (సమ సమాజం):** రాష్ట్రంలో శ్రీలంక తరహా కుటుంబ పాలన సాగుతోందని పీసీసీ మాజీ చీఫ్, ఎంపీ ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. అక్కడ రాజపక్స కుటుంబానికి పట్టిన గతే ఇక్కడ కల్వకుంట్ల కుటుంబానికి పడుతుందని అన్నారు. గాంధీభవన్ లో జరిగిన సమావేశంలో మాట్లాడిన ఆయన.. గోదావరి వరదల వల్ల ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాపం తెలిపారు. వరద పరిస్థితిని సమీక్షించేందుకు కాంగ్రెస్ పార్టీ ఒక కమిటీ ని ఏర్పాటు చేసిందని ఉత్తమ్ వెల్లడించారు. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులు.. కేసీఆర్ పాలనా తీరుపై ఉత్తమ్ కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి పార్టీ వాళ్లు.. వారికి అనుకూలంగా సర్వే చేసుకుంటున్నారని అభిప్రాయపడ్డారు. టీఆర్ఎస్ నేతలు అహంకారంతో

2వ

## డిజిటల్ మీడియాకు కళ్లెం

- ఇక రిజిస్ట్రేషన్ తప్పనిసరి చేయనున్న కేంద్రం

**న్యూఢిల్లీ, జూలై 15 (సమ సమాజం):** డిజిటల్ మీడియాకు క్లళెం వేసేందుకు కేంద్రం చర్యలు చేపట్టింది. విచ్చలవిడిగా పుట్టగొడుగుల్లా పుట్టుకు వస్తున్న యూట్యూబ్ ఛానళ్లకు ఇక కళ్లెం పడనుంది. డిజిటల్ మీడియాను ప్రభుత్వ నియంత్రణ పరిధిలోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగా రిజిస్ట్రేషన్ ఆఫ్ ప్రెస్ అండ్ పీరియాడికల్స్ చట్టాన్ని సవరించనుంది. చట్ట సవరణ అనంతరం డిజిటల్ న్యూస్ సైట్లు సహా సంబంధిత డిజిటల్ మీడియా ప్రెస్ రిజిస్ట్రార్ జనరల్ వద్ద తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సి ఉంటుంది. దాని నిబంధనలకు అనుగుణంగా

2వ

## కేంద్ర విధానాలపై ఇక ప్రత్యక్ష పోరు

- పార్లమెంట్ వేదికగా నిలదీయనున్న టిఆర్ఎస్
- నేడు ఎంపిలతో సిఎం కెసిఆర్ భేటీ
- పార్లమెంటులో అనుసరించే వ్యూహంపై చర్చ



**హైదరాబాద్, జూలై 15 (సమ సమాజం):** కేంద్రం అనుసరిస్తున్న అసంబద్ధ వైఖరిపై రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ తన కార్యాచరణను మళ్లీ ముందుకు తసీఉకుని పోయేందుకు సిద్ధం అవుతున్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కలిసి వచ్చే అన్ని రాష్ట్రాల విపక్ష పార్టీలను సమన్వయం చేసుకుని పోవాలని నిశ్చయించారు. ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బీజేపీ విధానాలను కేసీఆర్ ఎండగట్టనున్నారు.

3వ

## బాసరలోని ట్రిపుల్ ఐటీలో ఫుడ్ పాయిజన్

60 మంది విద్యార్థులకు అస్వస్థత

ఆస్పత్రికి తరలించి చికిత్స



**బాసర, జూలై 15 (సమ సమాజం):** బాసరలోని ట్రిపుల్ ఐటీలో ఫుడ్ పాయిజన్ జరిగింది. కలుషిత ఆహారం తిన్న 60 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. వాంతులు, విరోచనాలతో విద్యార్థులు బాధపడుతున్నారు. క్యాంపస్‌లోని ఆస్పత్రిలో కొంతమంది విద్యార్థులకు చికిత్స అందిస్తున్నారు. మరికొంత మంది విద్యార్థులను మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు. ఫుడ్ పాయిజన్ జరగడానికి గల కారణాలపై అధికారులు ఆరా

2వ

## 11 నెలల కనిష్ఠానికి బంగారం ధరలు



**న్యూఢిల్లీ, జూలై 15 (సమ సమాజం):** గ్లోబల్ మార్కెట్‌లో పసిడి ధరలు 11 నెలల కనిష్ఠానికి చేరాయి. అమెరికా డాలర్ విలువ రోజురోజుకీ పెరిగిపోతుండడం బంగారం ధరలపై ప్రభావం చూపుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్స్ (28.349 గ్రాములు) బంగారం ధర 1.5 శాతం తగ్గి 1,710 డాలర్ల (రూ. 1,36,590)కు చేరింది. అలాగే, వెండి ధర ఔన్సుకు 2.2

2వ

## రూ.101కే స్మార్ట్ ఫోన్..!

షో రూమ్‌పై ఎగబడ్డ జనాలు



**కోయంబత్తూరు, జూలై 15 (సమ సమాజం):** ఆధునికత పెరుగుతున్న ఈ కాలంలో స్మార్ట్ ఫోన్ల వినియోగం పెరిగింది. స్మార్ట్‌ఫోన్‌లు వాడని వారు ఉండరనే స్థాయిలో మనిషికి థర్డ్ హ్యాండ్‌గా మారింది. కేవలం కమ్యూనికేషన్ కోసం మాత్రమే ఉపయోగపడిన సెల్‌ఫోన్లు ఇప్పుడు స్మార్ట్ ఫోన్ల రూపంలో మనిషికి అవసరమైన వివిధ పనులను సులభతరం చేస్తున్నాయి.

2వ

## అమ్మవారికి బంగారు బోనం సమర్పించిన తలసాని



**హైదరాబాద్, జూలై 15 (సమ సమాజం):** సికింద్రాబాద్ మహంకాళి అమ్మవారి ముఖ ద్వారాలు శుక్రవారం ఉదయం పండుగ వాతావరణంలో ప్రారంభమయ్యాయి. మహంకాళి అమ్మవారికి మంత్రి శ్రీనివాస్ యాదవ్ కుటుంబ సభ్యులు బంగారు బోనంతో బోనం

2వ

## అసలు కిషన్ రెడ్డి తెలంగాణ వాడేనా ?

ఎమ్మెల్సీ డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి



**హైదరాబాద్, జూలై 15 (సమ సమాజం):** కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ధాన్యం సేకరణపై తలా తోక లేకుండా మాట్లాడుతున్నారని రైతు బంధు సమితి అధ్యక్షులు , ఎమ్మెల్సీ డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ..

కేంద్రం తెలంగాణకు అన్యాయం

2వ

## గోదావరి ఉగ్రరూపంతో ప్రజల్లో ఆందోళన

- ములుగు జిల్లాలో తగ్గని గోదావరి ఉధృతి
- ఎక్కడ చూసినా నీట మునిగిన పంటపొలాలు
- రామప్ప ఆలయంలో వరదనీరు చేరిక

**ములుగు,జూలై 15 (సమ సమాజం):** గోదావరి పరివాహక ప్రాంతం ప్రమాదంలో ఉంది. మూడో ప్రమాద హెచ్చరిక దాటి గోదావరి ప్రవహిస్తోంది. దీంతో తీర ప్రాంత ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు రెడ్ అలెర్ట్ జారీ చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఏటూరునాగారం మండలం, రామన్నగూడెం పుష్కర ఘాట్ దగ్గర 18.600 మీటర్ల మేర గోదావరి ప్రవాహం ఉంది.ములుగు, వాజేడు మండలంలోని పేరూరు దగ్గర గోదావరి ఉగ్రరూపం దాల్చింది. 18.89 మీటర్లకు గోదావరి నీటిమట్టం చేరింది. దీంతో పరివాహక ప్రాంత ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. రాష్ట్రంలో ఎడతెరిపిలేని వర్షాలతో అన్నదాతకు అపారనష్టం

2వ



## ఉమ్మడి జిల్లాలో తగ్గుముఖం పట్టిన వానలు

మత్తడి దుంకుతున్న పాకాల చెరువు



**వరంగల్, జూలై 15 (సమ సమాజం):** ఉమ్మడి జిల్లాలో గురువారం నుంచి వర్షం తగ్గుముఖం పట్టింది. మేఘావృతంగా ఉండి ముసురు కురుస్తున్నా తగ్గుముఖం పట్టడంతో ప్రజలు బయటకు వచ్చారు. ఆరు రోజులుగా కురిసిన వర్షానికి జిల్లా వ్యాప్తంగా చెరువులు, కుంటలు, కాల్వలు వరద నీటితో నిండిపోయాయి. జిల్లాలో అతి పెద్దదయిన

2వ

## లక్షల ఎకరాల్లో మునిగిన పంట

- ఇసుకమేటలతో పాటు..నీటి నిల్వతో కుళ్లిన మొక్కలు
- రంగంలోకి దిగని వ్యవసాయ శాఖ అధికారులు
- సాయం కోసం అన్నదాతల ఎదురుచూపు





**హైదరాబాద్, జూలై 15 (సమ సమాజం):** భారీ వర్షాలు, వరదలకు రాష్ట్రవ్యాప్తంగా లక్షల ఎకరాల్లో పంటలపై ఇసుక మేటలు వేశాయి. నీటమునిగి మొక్కలు కుళ్లిపోతున్నాయి. నష్టపోయిన రైతుల వేదన వర్ణనాతీతంగా ఉంది. అధిక వర్షాలతో వచ్చిన వరదతో వాగులు ఉధృతంగా ప్రవహించడంతో సమీప పొలాల్లో భారీగా ఇసుక మేటలు వేశాయి. మైదాన ప్రాంతాలను తలపిస్తున్నాయి. వేల ఎకరాల్లో వేసిన సోయా, పత్తి పంటలు మునిగి పోయి నాశనమయ్యాయి. లక్షలు అప్పు తెచ్చి పెట్టుబడి పెట్టానని, పంట పూర్తిగా దెబ్బతినడంతో ఎలా తిరిగి కట్టాలో తోచడం లేదని వాపోతున్నారు. ఇంత జరిగినా ఇంకా వ్యవసాయశాఖ రంగంలోకి దిగలేదు. ఎన్ని

2వ

## సంపాదకీయం

# మానవ తప్పిదాల వల్లే విపత్తులు !

మానవ తప్పిదాలపై ప్రకృతి ప్రకోపం చూపిస్తూ హెచ్చరికలు చేస్తున్నా..ప్రజలుగా మనం,పాలకులు కళ్లు తెరవడం లేదు. ఈ పూటగడిస్తూ చాలు అన్న ధోరణిలో ప్రజలు..ఈ ఐదేళ్లు అధికారంలో ఉంటే..మరో ఐదేళ్లు చూసుకుందామన్న ధోరణిలో పాలకపక్షాలు ఉంటున్నాయి. ఇష్టం వచ్చినట్లుగా తీసుకుంటున్న నిర్ణయాలతో ప్రకృతి ఆగ్రహానికి గురవుతున్నాం. అయినా కళ్లు తెరవడం లేదు. ఆత్మపరిశీలన చేసుకోవడం లేదు. తప్పిదాలను సరిదిద్దుకోవడం లేదు. తాజాగా గోదావరి ఉగ్రరూపంలో మరోమారు ప్రకృతి మనలను హెచ్చిరించింది. ఇది రాత్రికి రాత్రే జరిగిన విఘాతం కాదు. ఏళ్లుగా పాలకులు ముందదు చూపు లేకుండా తీసుకున్న నిర్ణయాలకు ప్రజల స్వార్థం తోడయ్యింది. దీంతో చెరువుల మాయయం అయ్యాయి. కాలువుల మాయం అయ్యాయి. నదీపరివాహక ప్రాంతాలు మాయమయ్యాయి. ఇలా అందరి కర్ణుడి చావుకు కారణం అనేకులు అన్న చందంగా మనం ఇప్పుడు ప్రకృతి విపత్తులకు విలవిల్లాడుతున్నాం. గోదావరి ప్రారంభం అయ్యే బాసర నుంచి ధవళేశ్వరం వరకు తెలుగు రాష్ట్రాల్లో అల్లకల్లోం సాగింది. ఉగ్రగోదావరి ఎలా ఉంటుందో చూసాం. ఊర్లన్నీ చెరువలయ్యాయి. లంక గ్రామాలు విలవిల్లాడాయి. దీనికంతటికీ మనమే కారణం. నదీ పరివాహక ప్రాంతాలను ఆక్రమించి గ్రామాలను కట్టుకోవడం, అడ్డదిడ్డంగా ఇళ్లు నిర్మించడం వంటివి మన తప్పిదాలకు సజీవ సాక్ష్యాలు. అలాగే గొలుసుకట్టు చెరవులను మింగి ఇళ్లు నిర్మించుకోవడం కూడా మనం చేసిన తప్పిదాల్లో భాగమే. గ్రామాల్లో గతంలో ఎంతగా వర్షం వచ్చినా ఇలా బీభత్సం జరిగిన దాఖాలాలు లేవు. నీరు దిగువకు పోయేలా మన పూర్వీకులు అద్భుతమైన గొలుసుకట్టు చెరువులను నిర్మించారు. నదులకు ఇష్టం వచ్చినట్లు గండ్లు పెట్టలేదు. అందుకే ఎడతెరిపిలేకుండా కురిసిన వానలకు గోదావరి కన్నెర్ర చేసింది. ఉభయ తెలుగు రాష్ట్రాలను గోదావరి వరద వణికించింది. ఎగువన మహారాష్ట్ర నుంచి కింద ఆంధ్రా వరకు ఉప్పొంగి ప్రవహిస్తూ ఊళ్లకు ఊళ్లను నీట ముంచేసింది. నిర్మల్, మంచిర్యాల, కొమురంభీం ఆసిఫాబాద్, పెద్దపల్లి, కరీంనగర్, సిరిసిల్ల, భూపాలపల్లి, ములుగు, ఖమ్మం, భద్రాచలం జిల్లాల్లో గోదావరి, ఉప నదుల బీభత్సంతో జన జీవనం అతలాకుతలమైంది. చాలాచోట్ల రోడ్లపై వరద నీరు ప్రవహిస్తూ మనకు దారిలేకుండా చేయడంతో పాటు లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యేలా చేసింది. జూలై నెలలోనే శ్రీరాంసాగర్ ప్రాజెక్టు గేట్లు ఎత్తడం చరిత్రలోనే తొలిసారి కాగా.. ఎల్లంపల్లి ప్రాజెక్టుకు ఏకంగా 13 లక్షల క్యూసెక్కుల వరద వచ్చింది. దానికి ప్రాణహిత, ఇతర ఉప నదులు, వాగుల నీరుకలిసి.. కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని అన్నారం, సుందిళ్ల, మేడిగడ్డ ప్రాజెక్టులు సముద్రాన్ని తలపించాయి. ఎల్లంపల్లి నుంచి భద్రాచలం వరకు గోదావరి పరీవాహక ప్రాంతాలు జలమయం అయ్యాయి. అన్నారం, కన్నెపల్లి పంపుహౌస్‌లు నీట మునిగాయి. ముంపు ప్రాంతాల నుంచి 19 వేల మందికిపైగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్టు అధికారులు వెల్లడించారు. గోదావరి పరీవాహక ప్రాంతమంతటా రెడ్ అలర్ట్ ప్రకటించాల్సి వచ్చింది. ఇకపోతే ఎపిలో ఉభయగోదావరి జిల్లాలు అతలాకుతలం అయ్యాయి. విలీన మండలాలు నీట మునిగాయి. పోలవరం వద్ద వరదగోదావరి ఉప్పెనలా వచ్చింది. గోదావరి మహోగ్ర రూపంతో జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్, పలిమెల మండలాల్లో 25 గ్రామాలు పూర్తిగా జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. కాళేశ్వరం వద్ద నీటిమట్టం 16.80 మీటర్ల ఎత్తుకు చేరడంతో.. పుష్కర ఘాట్లు మునిగిపోయి సంగమేశ్వర ఆలయం దాకా నీరు వచ్చింది. ముంపు ప్రాంతాల వారిని బోట్లలో బయటికి తీసుకుని రావాల్సి వచ్చింది. వస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో గోదావరి వరద పోటెత్తడంతో చర్ల, దుమ్ముగూడెం, అశ్వాపురం, బూర్గంపాడు మండలాల్లో చాలాచోట్ల విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. గోదావరిలో ఇన్‌టేక్ వెల్స్ మునిగిపోవడంతో మంచి నీటి సరఫరా కూడా లేకుండా పోయింది. వరద ప్రమాదం నేపథ్యంలో ప్రజల కదలికలపై అధికారులు ఆంక్షలు విధించారు. భద్రాచలం పట్టణంతోపాటు బూర్గంపాడు మండలంలో గురువారం మధ్యాహ్నం నుంచి 144 సెక్షన్‌ను అమల్లోకి తెచ్చారు. అత్యవసరమైతేనే తప్ప ఎవరూ ఇళ్లలోంచి బయటికి రావొద్దని హెచ్చరించారు. చర్ల దుమ్ముగూడెం భద్రాచలం, బూర్గంపాడు సారపాక దారిలో చాలా చోట్ల గోదావరి వరద రోడ్లపైకి చేరి.. రాకపోకలు నిలిచిపోయాయి. గోదావరి దిగువన పోటెత్తుతుంటే జనం బిక్కుబిక్కుమంటూ ఉండి పోయారు. ప్రభుత్వాలు కూడా అప్పటికప్పుడు ఏమీ చేయలేని దుస్థితి ఏర్పడింది. గోదావరి ఉగ్రరూపంతో పెద్దపల్లి జిల్లా రామగుండం కార్పొరేషన్, మంథని మున్సిపాలిటీ జలమయం కాగా.. గోదావరి పరీవాహక గ్రామాలు నీటమునిగాయి. బాధితులను పునరావాస శిబిరాలకు తరలించారు. గోదావరిఖని వద్ద బ్రిడ్జి నీట మునగడంతో మంచిర్యాల-పెద్దపల్లి మధ్య రాకపోకలు నిలిపివేశారు. మంథని పట్టణం మీదుగా ప్రవహించి గోదావరిలో కలిసే బొక్కలవాగులో వరద వెనక్కి తన్నడంతో మంథని పట్టణంలోని చాలా భాగం జలమయమైంది. చివరిసారిగా 1986లో భద్రాచలం వద్ద 76 అడుగుల ఎత్తుతో అత్యంత భారీ వరద వచ్చింది. ఆ సమయంలో భద్రాచలంతోపాటు చుట్టుపక్కల గ్రామాలన్నీ జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. గోదావరిపై భద్రాచలం-సారపాక వంతెనపై రాకపోకలను నిలిపివేశారు. మళ్లీ సుమారు 36 ఏళ్ల తర్వాత ఇప్పుడు మరోసారి ఆ వంతెనపై రాకపోకలు ఆగిపోయాయి. ఎగువన మేడిగడ్డ నుంచి వస్తున్న వరదతో భద్రాచలం వద్ద గోదావరి మట్టం పెరిగింది. దానికితోడు శబరి ఎగువ ప్రాంతంలో వర్షాలతో ఆ వరద కూడా వచ్చే అవకాశం ఉందని అధికారుల అంచనా వేశారు. గోదావరి తీర ప్రాంతాలను ముంచెత్తుతూ భద్రాచలం పట్టణాన్ని చుట్టుము ట్టింది. రహదారులను ముంచేస్తూ ఇళ్ల దాకా వరద పోటెత్తింది. పట్టణానికి తూర్పున కూనవరం రోడ్డు, పశ్చిమాన చర్ల రహదారిపైకి నీరు చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. భద్రాచలం పూర్తిగా జలదిగ్బంధంలో చిక్కుకుంది. ఏజెన్సీ, ముంపుప్రాంతాల్లో జనజీవనం అస్తవ్యస్తమైంది. ప్రజలు ఎప్పుడేం అవుతుందోనన్న ఆందోళనతో బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. వరద అంచనాతో ఏర్పాటు చేసిన పలు పునరావాస కేంద్రాల్లోకీ వరద నీరు చేరుకుంది. దీంతో అప్పటికప్పుడు కొత్త కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజలను తరలించారు. ఇది ఇప్పట్లో ఆగిపోదు. దీంతో పాలకులు పాఠాలు నేర్వాలి. వరదలు ఉధృతంగగా వస్తే అన్న కోణంలో ఆలోచన చేయాలి. ఆక్రమిత ప్రాంతాలను తొలగించి చెరువులను పునరుద్ధరించాలి. కాలువలు సాఫీగా వెళ్లడానికి ఏర్పాట్లు చేయాలి. అప్పుడే విపత్తులను తట్టుకోగలం.

పృధ్విరాజ్ గోసుకొండ
ఎడిటర్

# గోదావరి ఉగ్రరూపంతో ప్రజల్లో ఆందోళన

(మొదటి పేజి తరువాయి) వాటిల్లింది. లక్షల ఎకరాల్లో పంటలు నీటమునిగాయి. ఇంత నష్టం జరిగిన వ్యవసాయాధికారులు పంట నష్టాలను అంచనా వేయడం లేదు. పరిహారం వచ్చే అవకాశాలు కనిపించక రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో పాటు పంటలు దెబ్బతిన్నాయి. ఎక్కడ చూసినా నీరే దర్శనమిస్తోంది. గిరిజన ప్రాంతాల్లో ప్రజల బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో గోదావరి నది తన మహోగ్రరూపంతో వణికిస్తోంది. గత వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో భీకరంగా పోటెత్తుతోంది. ప్రవాహం ప్రమాదకర స్థాయిని దాటడంతో తీర ప్రాంతాల్లోని గ్రామాలు జలమయం అయ్యాయి. వేలాదిమంది జనం నిరాశ్రయులయ్యారు. రెండు జిల్లాల అధికారులు ఎప్పటికప్పుడు సహాయక చర్యలు చేపట్టారు. వర్షాల జోరు ఇంకా తగ్గక పోవడంతో ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. మరోవైపు గోదావరి తీరంలో ఉన్న గ్రామాల్లోకి బ్యాక్ వాటర్ చేరటంతో పాటు వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో అనేక గ్రామాలు జలదిగ్బంధం అయ్యాయి. విద్యుత్ సరఫరా నిలిచి పోవటంతో పాటు నిత్యావసర సరుకులు లేక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. దీంతో బాధితులను సురక్షిత ప్రాంతాలకు చేర్చేందుకు ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు రంగంలోకి దిగాయి. ముంపు ప్రాంతాల నుంచి పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు. గోదావరి ఈ స్థాయిలో ఉప్పొంగడం 1986లో జరిగిందని, 36 ఏళ్లకు ఇప్పుడు మళ్లీ ప్రవహిస్తోందని చెబుతున్నారు. మరోవైపు ప్రపంచ వారసత్వ కట్టడంగా యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయం అధిక వర్షాలతో ముప్పును ఎదుర్కొంటోంది. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలతో ఆలయం చుట్టూ వరద నీరు వచ్చి చేరుతోంది. మురుగు కాల్వలోకి సాఫీగా నీరు వెళ్లేందుకు అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో ఆలయ ప్రాంగణంలోనే వర్షపు నీరు నిలిచిపోతోంది. రామప్ప దేవాలయం.. ఇటీవలే యునెస్కో గుర్తింపు పొందిన ఏకైక కట్టడం. కాకతీయులు మేధోసంపత్తిని, గజ, అశ్వ, సైనిక బలాలను ఉపయోగించి ఇసుక దిబ్బపై ఎంతో నేర్పు, పరిజ్ఞానంతో నిర్మించిన రాతి కట్టడం కావడంతోఅధిక వర్షాలతో ముప్పును ఎదుర్కొంటోంది. పురావస్తుశాఖ నిర్లక్ష్యం కారణంగా ఏటా వర్షాకాలంలో ఏదో ఒక సమస్య తలెత్తుతోంది. ఇటీవల ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు రామప్ప ఆలయం చుట్టూ వరదనీరు చేరుతోంది. నలుమూలలా మురుగుకాల్వల్లో పూడిక మట్టి చేరింది. రామప్ప ఉపాలయాల పరిస్థితి మరీ దారుణంగా మారింది. కనీసం వరదనీటిని ఎప్పటికప్పుడు బయటకు వెళ్లేలా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. 2020లో ఆలయం ఈశాన్య భాగంలోని ప్రహరీ వర్షాలకు కూలింది. ఇప్పటికీ మరమ్మతులు చేపట్టలేదు. 2017లో ఆలయానికి వెళ్లే మార్గంలో.. ప్రస్తుత పార్కింగ్ స్థలానికి దగ్గరలోని శివాలయం కూడా కూలి పోయింది. దీనిని పునరుద్ధరించ లేదు. 2015లో నీరు లీకవుతున్న ప్రాంతాలను గుర్తించి పైభాగంలోని ఒక పొరను పూర్తిగా తొలగించారు. కొత్తగా మళ్లీ శ్లాబ్ వేసినా ఫలితం లేకపోయింది. 2014లో ఆలయంలోని మరో 4చోట్ల నీరు కారడం మొదలైంది. దాన్ని అరికట్టడం కోసం పురావస్తుశాఖ ఆధ్వర్యంలో మరమ్మతులు చేశారు. పనులు నామ మాత్రంగా చేయడంతో సమస్య మళ్లీ ఉత్పన్నమైంది. 2013లో ఆలయంలోని ఈశాన్యభాగంలో చిన్నగా నీరు కారడం మొదలైంది. దాంతో అప్పుడప్పుడు పెచ్చులూడుతున్నాయి.ఇవీ చేయాల్సిన పనులు.. రామప్ప పర్యవేక్షణకు ఐఏఎస్ స్థాయి అధికారిని నియమించాలి. ఆలయ పరిధిలోని పురావస్తు శాఖ అధికారులు సైతం నిత్యం రామప్పలోను ఉంటూ విధులు నిర్వర్తించేలా చూడాలి. కాకతీయులు ముందు చూపుతో ఆలయం నలుమూలలా మురుగు కాల్వలను నిర్మించినా వాటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేయక పోవడంతో ప్రమాదం ఏర్పడింది.

# లక్షల ఎకరాల్లో మునిగిన పంట

(మొదటి పేజి తరువాయి) ఎకరాల్లో పంటలు నీటమునిగాయో తెలుసుకునేందుకు వ్యవసాయశాఖ అంచనాలు వేయడం లేదు. మరోవైపు 'ప్రధాన మంత్రి పంటల బీమా' పీఎంఎఫ్‌బీవై పథకాన్ని రాష్ట్రంలో అమలు చేయడం లేదు. దీంతో పరిహారం వచ్చే అవకాశాలు కనిపించక రైతులు ఆవేదన చెందుతున్నారు. పంటలు పూర్తిగా నాశనమై రైతులు నష్టపోయిన మాట వాస్తవమే అయినా.. వివరాలు సేకరించి పంపాలని వ్యవసాయ కమిషనర్ కార్యాలయం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదని, అందువల్ల తామేం చేయలేమని వ్యవసాయాధికారి ఒకరు తెలిపారు. తమ వద్ద ఎలాంటి వివరాలు లేనందువల్లే చెప్పలేకపోతున్నామని వివరించారు. అయితే, రాష్ట్రంలో 10.76 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారని తమ అంచనాల్లో తేలినట్లు రైతుసంఘాలు చెబుతున్నాయి.?ఒక్క ఆదిలాబాద్ జిల్లా పరిధిలోనే 18 మండలాల్లో 1,03,305 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు స్థానిక అధికారులు అనధికారికంగా అంచనా వేశారు. నిజామాబాద్‌లో 40 వేల ఎకరాలు, కరీంనగర్‌లో 15 వేలు, పెద్దపల్లి జిల్లా పరిధిలోని 191 గ్రామాల్లో 6493, కుమురం భీంలో 47,345, నిర్మల్ జిల్లాలో 20,294 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు సమాచారం. కొన్ని జిల్లాల్లో పంటలు నీటమునిగినా వ్యవసాయాధికారులు వివరాలు వెల్లడించడం లేదు. ? పత్తి, సోయా, మొక్కజొన్న వంటి పైర్లు ప్రస్తుతం చిన్న మొక్కల దశలో ఉన్నాయని, ఎక్కువ రోజులు నీటిలో మునిగి ఉన్నా అధిక తేమను తట్టుకోలేక చనిపోతాయని సీనియర్ వ్యవసాయాధికారి ఒకరు చెప్పారు. ఈ పొలాల్లో ఉన్న నీటిని వెంటనే బయటికి పంపేలా రైతులు చర్యలు తీసుకోవాలని ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం సూచించింది. అధిక తేమకు తెగుళ్లు వ్యాప్తి చెందే అవకాశముందని, సస్యరక్షణ చర్యలు చేపట్టాలని తెలిపింది.

# ఉమ్మడి జిల్లాలో తగ్గుముఖం పట్టిన వానలు

(మొదటి పేజి తరువాయి) ఖానాపూర్ మండలంలోని పాకాల చెరువు 30అడుగుల పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకొని మత్తడి పోసింది. దుగ్గొండి మండలంలోని గుండం చెరువు, చెన్నారావుపేటలోని ముత్తడి చెరువు, నర్సంపేటలోని మాధన్నపేట చెరువు, నల్లబెల్లిలో రంగాయ చెరువు మత్తడి పోస్తున్నాయి. వర్షాలతో నగరంలో ఎలాంటి ఇబ్బందులు చోటుచేసుకోకుండా వరదనీరు సాఫీగా వెళ్లేలా బల్దియా అధికారులు చర్యలు తీసుకున్నారు. అన్నదాతలు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. ఎరువులు, విత్తనాలు కొంటూ దుక్కులు దున్నుతున్నారు. పాకాల సరస్సు పరవళ్లు తొక్కుతూ మత్తడి పడుతూ కనువిందు చేసింది. 30.2 అడుగుల గరిష్ట నీటి సామర్థ్యం గల పాకాల సరస్సు కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలతో సరస్సు పూర్తిస్థాయిలో నిండి మత్తడి దూకుతుం డడంతో ఆయకుట్టు రైతుల్లో ఆనందం నెలకొంది. జూలై రెండో వారంలోనే సరస్సు మత్తడి పడడం ఇదే మొదటి సారని రైతులు తెలిపారు. ఆయకట్టు రైతులు పాకాల మత్తడిని చూసి ఆనందంతో పరవశించిపోతున్నారు. నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పాకాల సరస్సులో మత్తడి వద్ద పసుపు, కుంకుమ వేసి

# అమ్మవారికి బంగారు బోనం సమర్పించిన తలసాని

(మొదటి పేజి తరువాయి) సమర్పించారు. ఈ కార్యక్రమంలో మంత్రి తలసాని డ్యాన్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. బోనాలతో మహిళల నృత్యాలు, పోతురాజులు, కొలాటం ప్రదర్శనలు అలరి ంచాయి. మంత్రులు మహమూద్ అలీ, మల్లారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, చైర్మన్‌లు దూదిమెట్ల బాలరాజ్ యాదవ్, రావుల శ్రీధర్ రెడ్డి, గజ్జెల నగేష్, మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలత, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కార్యక్రమంలో పాల్గొన్నారు.



# అసెంబ్లీ రద్దు చేసే దమ్ము కేసీఆర్‌కు ఉందా..?




(మొదటి పేజి తరువాయి) మాట్లాడుతున్నారని మండిపడ్డ ఆయన కేసీఆర్?కు అసెంబ్లీ రద్దు చేసే దమ్ము ఉందా.. అని ప్రశ్నించారు. దమ్ముంటే ఈ క్షణంలో అసెంబ్లీ రద్దు చేయాలని.. తాము ఎన్నికలకు సిద్ధమని ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. వచ్చే ఎన్నికలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. హిమాచల్ ప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాల్లో కూడా కాంగ్రెస్ గెలుస్తుందని చెప్పారు. కేసీఆర్ హయాంలో విద్యా వ్యవస్థ సర్వ నాశమైందని ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. 12 లక్షల మంది విద్యార్థులకు 3,270 కోట్లు బాకీ పడ్డ టీఆర్ఎస్ సర్కారు 2020 - 22 ఫీజు రీయింబర్స్ మెంట్ ను ఇంత వరకు విడుదల చేయలేదని మండిపడ్డారు. ఫీజులు కట్టలేక 30 శాతం విద్యార్థులు డ్రాపౌట్ అయ్యారని వాపోయారు. మైనార్టీ విద్యా సంస్థల్లో 90 శాతం మూతపడ్డాయని, 2014 నుండి ఇప్పటి వరకు 1.2 లక్షల విద్యార్థులు మధ్యలోనే చదువులు ఆపేశారని ఆందోళన వ్యక్తం చేశారు. కేసీఆర్ చెప్పిన కేజీ టూ పీజీ ఉచిత విద్య ఏమైందని ఉత్తమ్ ప్రశ్నించారు. తెలంగాణ వచ్చాక 850 జూనియర్ కాలేజీలు, 350 డిగ్రీ , 150 పీజీ కాలేజీలతో పాటు వందల సంఖ్యలో ఇంజనీరింగ్, ఫార్మా కాలేజీలు మూతపడ్డాయని చెప్పారు. కాంగ్రెస్ హయాంలో 100శాతం ఫీజు రీఎంబర్స్ మెంట్ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేసిన ఉత్తమ్.. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఫీజు రీఎంబర్స్ మెంట్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ధనిక రాష్ట్రమైన తెలంగాణలో ఇప్పుడు అప్పులకుప్పగా మారి ఉద్యోగులకు జీతాలివ్వలేని పరిస్థితి ఏర్పడిందని ఎంపీ ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. మన ఊరు మన బడి కార్యక్రమం కింద 26 వేల ప్రభుత్వ బడులను ఎంపిక చేశారని.. రూ.3,497 కోట్లు ఖర్చు చేస్తామని ఇంత వరకు నిధులు విడుదల చేయలేదని అన్నారు. రాష్ట్రంలో 33 జిల్లాలకు కేవలం 10 మంది మాత్రమే డీఈఓలు ఉన్నారని వివరించారు. రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా నివేదిక ప్రకారం విద్యా వ్యవస్థ మీద అతి తక్కువ ఖర్చు చేసిన రాష్ట్రం తెలంగాణనే అని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

# 11 నెలల కనిష్ఠానికి బంగారం ధరలు




(మొదటి పేజి తరువాయి) శాతం తగ్గి 18.76 డాలర్ల (రూ.1,498.50)కు దిగజారింది. భారత్‌లో బంగారం ధర ఎంసీఎక్స్‌లో 1 శాతం తగ్గి 10 గ్రాముల ధర రూ.50,281గా ఉంది. అలాగే, వెండి ధర 3.5 శాతం తగ్గి కిలో ధర రూ.55,194కి చేరింది. దిగుమతి సుంకం పెంచడంతో ఈ నెల మొదట్లో భారత్‌లో 10 గ్రాముల బంగారం ధర రూ.52,300కి పెరిగిన విషయం తెలిసిందే. ఇప్పుడు బంగారం ధరలు తగ్గడం గమనార్హం. అయినప్పటికీ, గ్లోబల్ మార్కెట్ల స్థాయి అంతటి తక్కువ ధరలు భారత్‌లో లేవు. మరోవైపు, ద్రవ్యోల్బణ ఒత్తిళ్ళ వల్ల అమెరికా ఫెడ్ వడ్డీ రేట్లను 100 బేసిస్ పాయింట్లు పెంచే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ నెల 26, 27న విధానపర నిర్ణయాలు తీసుకోవడానికి సమావేశం నిర్వహించి ఈ మేరకు ప్రకటన చేసే అవకాశం ఉందని భావిస్తున్నారు. జూన్‌లో అమెరికా వార్షిక ద్రవ్యోల్బణం రేటు 9.1 శాతానికి చేరింది. ఊహించిన దానికంటే గరిష్ఠానికి చేరిన ద్రవ్యోల్బణాన్ని కట్టడి చేసేందుకు అమెరికా ఫెడరల్ రిజర్వ్ వ్యవస్థ కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. దీంతో బంగారం ధరలు మరింత తగ్గే అవకాశాలు ఉన్నట్లు నిపుణులు చెబుతున్నారు.

# రూ.101కే స్మార్ట్ ఫోన్..!

(మొదటి పేజి తరువాయి) నిత్యావసర వస్తువుగా మారిన స్మార్ట్ ఫోన్లు మార్కెట్లలో రూ.5 వేల నుంచి లక్షలకు విక్రయిస్తున్నారు. ఈ పరిస్థితిలో అక్కడ కొత్త ప్రారంభించిన ఒక సెల్ ఫోన్ షాపులో కేవలం 101 రూపాయలకే స్మార్ట్ ఫోన్ విక్రయిస్తామని ప్రకటించారు. ఇంకేముంది.. జనాలు ఎగబడ్డారు. అతి తక్కువ ధరకే స్మార్ట్ వస్తుందని తెలిసి షాపు ముందు కస్టమర్లు క్యూ కట్టారు. ఈ ఘటన తమిళనాడు కోయంబత్తూరులో చోటు చేసుకుంది. కోయంబత్తూరులోని గాంధీపురం 9వ వీధిలో కొత్తగా సెల్‌ఫోన్ షాప్ ఓపెన్ చేశారు. ఈ షాపులో పిక్సెల్ కమ్యూనికేషన్, ఉపయోగించిన సెకండ్ హ్యాండ్ సెల్ ఫోన్‌లను విక్రయిస్తుంటారు . ఈ స్టోర్ ప్రారంభోత్సవ ఆఫర్‌గా రూ.3,000కి ఉపయోగించిన సెల్‌ఫోన్‌ను కొనుగోలు చేసేవారు కేవలం రూ.101 చెల్లించి స్మార్ట్‌ఫోన్‌ను పొందవచ్చని ప్రకటించారు. దాంతో ఈ వార్త జిల్లా వ్యాప్తంగా దవానంలా వ్యాపించింది. రూ. 101 రూపాయల స్మార్ట్‌ఫోన్‌ను కొనుగోలు చేసేందుకు ఉదయం నుంచి దుకాణం ముందు జనం గుమిగూడారు. కోయంబత్తూరు నుంచే కాకుండా వివిధ జిల్లాల నుంచి వచ్చిన వారు ఈ దుకాణంలో స్మార్ట్ ఫోన్లు కొనుగోలు చేశారు.

# ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలు ముమ్మరం

(మొదటి పేజి తరువాయి) ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ ను ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఇరిగేషన్ ఉన్నతాధికారులతో ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించి జిల్లాలో చేపడుతున్న సహాయక, పునరావాస చర్యలను సమీక్షించారు. ఈ టెలికాన్ఫరెన్స్ లో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ కూడా పాల్గొన్నారు. వరద పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూన్నట్లు మంత్రి తెలిపారు.జిల్లాకు ఎన్‌డిఆర్ఎఫ్, ఆర్మీ, సింగరేణి, రెస్క్యూ టీమ్‌లను తరలించారు. ఆ టీమ్ లను భద్రాచలం, కొత్తగూడెం పట్టణాల్లో ఉంచినట్లుయైతే, వరద సహాయక చర్యలు సమర్థవంతంగా చేపట్టేందుకు అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు. వరద నీరు 80 అడుగులకు చేరినా పరిస్థితిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం సన్నద్ధం కావాలని సీఎస్ సోమేశ్ కుమార్ ఆదేశించారు. ముంపునకు గురయ్యే గ్రామాలు, ప్రాంతాల్లోని ప్రజలను ఖాళీ చేయించి ప్రత్యేక పునరవాస శిబిరాలకు తరలించాలన్నారు. ఇప్పటికే భద్రాచలంలో 10 ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు, ఆర్మీకి చెందిన 5 బృందాలు, సింగరేణి రెస్క్యూ టీమ్‌లు సిద్ధంగా ఉన్నాయని ఆయన తెలిపారు. వరదల సమయంలో ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా చూడాలని ప్రధాన కార్యదర్శి పునరుద్ఘాటించారు. ఆస్తినష్టం జరగకుండా కూడా సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలి. అన్ని సహాయక శిబిరాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించారు. రాత్రికి ఎయిర్‌ఫోర్స్ హెలికాప్టర్ ఐటీసీ భద్రాచలం వద్ద ఉంటుందని తెలిపారు. సహాయక చర్యలలో జిల్లా యంత్రాంగానికి తోడ్పాటుగా మరో నలుగురు సీనియర్ అధికారులను నియమించారు. ఇవాళ రాత్రికి 4 ఎన్డీఆర్ఎఫ్ బృందాలు బోట్లు, బస్సులు, ట్రక్కులు కూడా భద్రాచలంనకు తరలిస్తున్నట్లు ఆయన తెలిపారు.సహాయక చర్యలను సమన్వయం చేసేందుకు, పర్యవేక్షించేందుకు పోలీసు ఉన్నతాధికారులకు కూడా బాధ్యతలు అప్పగించినట్లు డీజీపీ మహేందర్‌రెడ్డి తెలిపారు.ఈ టెలి కాన్ఫరెన్స్ లో వివిధ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# డిజిటల్ మీడియాకు కళ్లెం

(మొదటి పేజి తరువాయి) నడుచుకోవాలి. అతిక్రమణకు పాల్పడితే వెబ్‌సైటు రిజిస్ట్రేషన్ రద్దు చేయడం లేదా జరిమానా కట్టాల్సి ఉంటుంది. ఈ మేరకు రిజిస్ట్రేషన్ ఆఫ్ ప్రెస్ అండ్ పిరియాడికల్స్ చట్ట సవరణ ప్రక్రియను కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వశాఖ ఇప్పటికే మొదలుపెట్టినట్లు సమాచారం. ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్మన్ నేతృత్వంలో కేంద్ర సమాచారశాఖ ఓ అప్పిలేట్ బోర్డు ఏర్పాటు యోచనలో ఉన్నట్లు సమాచారం. అయితే ఈ ప్రతిపాదిత సవరణ బిల్లుకు ఇంకా ప్రధానమంత్రి కార్యాలయం నుంచి గ్రీన్ సిగ్నల్ రాలేదని తెలుస్తోంది. కొత్త చట్టం అమల్లోకి వస్తే డిజిటల్ న్యూస్ సంస్థలను పర్యవేక్షించే ప్రెస్ రిజిస్ట్రార్ జనరల్ వద్ద డిజిటల్ న్యూస్ పబ్లిషర్లు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. 90 రోజుల వ్యవధిలో ఈ పక్రియను పూర్తి చేయాల్సి ఉంటుంది.



# అసలు కిషన్ రెడ్డి తెలంగాణ వాడేనా ?

(మొదటి పేజి తరువాయి) చేస్తున్నా కిషన్‌రెడ్డి మాట్లాడట్లేదని.. ఆయన అసలు తెలంగాణ బిడ్డేనా అనే అనుమానం కలుగుతోందన్నారు. బండి సంజయ్, కిషన్‌రెడ్డి యాసంగిలో ధాన్యం వేయమని రైతులకు సూచనలు చేశారని చెప్పారు. రైతులు ధాన్యం పండించాక ఇప్పుడు బియ్యం కొనడంలో కేంద్రం మెలికలు పెడుతోందన్నారు.రైతుల గోస పట్టించుకోకుండా ఈటల రాజేందర్ అవహేళనగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. నెలా పదిహేను రోజులుగా తెలంగాణలో రైస్ మిల్లులు నడవడం లేదన్నారు.రైస్ మిల్లుల వ్యవస్థను ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర పెద్దలు కూలుస్తున్నారని కేంద్రం వారి ఉసురు పోసుకుంటోందని ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రభుత్వం 20 వేల కోట్ల రూపాయలు వెచ్చించి కొనుగోలు చేస్తే కేంద్రం ఒక్క పైసా ఇవ్వలేదని చెప్పారు.చివరి గింజ వరకు కొంటామని చెప్పిన బండి సంజయ్ ఇప్పుడు ఎక్కడున్నారని పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రశ్నించారు.

# బాసరలోని ట్రిపుల్ ఐటీలో ఫుడ్ పాయిజన్

(మొదటి పేజి తరువాయి) తీస్తున్నారు. బాసర ట్రిపుల్ ఐటీలో ఫుడ్ పాయిజన్ జరిగింది. మధ్యాహ్నం ఇ 1, ఇ 2 మెస్ లో ఫ్రైడ్ రైస్ తిన్న దాదాపు 60 మంది అస్వస్థతకు గురయ్యారు. దీంతో వారిని ఆర్జీయూకేటీ హాస్పిటల్ కు తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. బాధిత విద్యార్థులను అంబులెన్సులతో పాటు ఫ్యాకల్టీ సొంత కార్లలో హాస్పిటళ్లకు తరలించారు. కొందరు విద్యార్థులకు ప్రస్తుతం నిజామాబాద్ హాస్పిటల్ లో ట్రీట్ మెంట్ కొనసాగుతోంది. ఇదిలాఉంటే ఫుడ్ పాయిజన్ విషయం బయటకు రాకుండా అధికారులు ప్రయత్నించినట్లు వార్తలు వస్తున్నాయి. బాసర ట్రిపుల్ ఐటీ ఫుడ్ కాంట్రాక్టర్ ను మార్చాలని విద్యార్థులు కొంత కాలంగా డిమాండ్ చేస్తున్నారు. ఆహారం నాసిరకంగా ఉంటోందంటూ పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఫుడ్ పాయిజన్ ఘటనపై విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి స్పందించారు. విద్యార్థులను వెంటనే హాస్పిటల్ కు తరలించి మెరుగైన వైద్యం అందించాలని బాసర ట్రిపుల్ ఐటీ డైరెక్టర్‌ను ఫోన్ లో ఆదేశించారు. ఘటనపై విచారణ జరిపి రిపోర్టు ఇవ్వాలని ఆదేశించారు. బాధ్యులపై వెంటనే చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు.



## మెదక్ ఆర్టీసీ డిపో మేనేజర్‌గా రవిచందర్



**మెదక్, జులై 15(సమ సమాజం):** మెదక్ ఆర్టీసీ డిపో మేనేజర్ ఎం. రవిచందర్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు మెదక్ డిపో మేనేజర్గా విధులు నిర్వహిస్తున్న ప్రణీత్ కూకట్పల్లి డిపోకు బదిలీ కాగా వరంగల్-2 డిపో నుంచి పదోన్నతిపై రవిచందర్ మెదక్కు బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న ప్రణీత్ ఆయనకు ఛార్జి అప్పగించారు. ఈ సందర్భంగా రవిచందర్ మాట్లాడుతూ. మెదక్ ఆర్టీసీ డిపోకు పదోన్నతిపై రావడం ఎంతో ఆనందంగా ఉందని ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ డిపోకు మంచి పేరు వచ్చేలా చూస్తానని తెలిపారు. డిపోకు సంబంధించి ఏమైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఆర్టీసీ సిబ్బంది సైతం వారి సమస్యలను తన దృష్టికి తీసుకురావచ్చున్నారు. ప్రతి ఒక్కరికి తన సహకారం ఉంటుందని ప్రజలు, సిబ్బంది కూడా తనకు సహకరించాలని రవిచందర్ పేర్కొన్నారు.

## మెదక్ జిల్లా వ్యాప్తంగా ఉపాధి హామీ పనులు సమర్ధవంతంగా నిర్వహించాలి




**మెదక్, జులై 15(సమ సమాజం):** మెదక్ జిల్లా, మెదక్ మండలం బాలానగర్లో పర్యటించిన కేంద్ర బృందం ట్రాక్టర్పై రెండు కిలోమీటర్లు వెళ్ళి పనుల పరిశీలన పనులకు సంబంధించి వివరాలు తెలిపిన జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్. మెదక్ జిల్లా వ్యాప్తంగా ఉపాధి హామీ పథకం పనులను సమర్ధవంతంగా నిర్వహించాలని, ఈ విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యంగా అధికారులు, సిబ్బంది వ్యవహరించరాదని కేంద్ర పర్యవేక్షణ బృందం డిప్యూటీ సెక్రెటరీ, టీమ్ లీడర్ సంజయ్ కుమార్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం మెదక్ మండలంలోని బాలానగర్ లో ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న పనులను జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్తో పాటు బృందం సభ్యులు రుచిసిన్హా, మోరేశ్వర్లు ట్రాక్టర్పై రెండుకిలోమీటర్ల దూరం వరకు వెళ్ళి పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలను, ఈజీఎస్ నిధులతో చేపట్టిన పల్లె ప్రకృతివనాలు నర్సరీలు, అడవిలో గుంతలు ఎంత మేర తీశారు. ఎంత దూరం నీరు వెళ్తుందనే వివరాలను కొలతల ద్వారా నమోదు చేసుకొన్నారు. అలాగే ఇప్పటి వరకు ఈ పథకం కింద ఎన్ని గుంతలు నిర్మించారు వాటి ప్రస్తుత పరిస్థితిని బృందం ఆధ్వర్యంలో పరిశీలించారు. దీంతో పాటు చెరువులు పూడికతీత,ఇంకుడుగుంతల నిర్మాణం, కమ్యూనిటీ ప్లాంటేషన్, మ్యాజిక్ ఫిట్లు, జాబ్కార్డుల వివరాలతో పాటు గ్రామపంచాయతీల్లో నిర్వహించే ఏడు రకాల రిజిష్టర్లు, కాలువల శుభ్రత వంటి సుమారు 25 రకాల పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న వివరాలను జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ అధికారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్డీవో పీడీ) ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాస్, ఇంఛార్జి ఎంపీడీవో ప్రశాంత్, సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, ఆయా శాఖల అధికారులు ఉన్నారు.

## కుమ్మర సంఘానికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని రంగారెడ్డి జిల్లా కుమ్మర సంఘం యూత్ అధ్యక్షుడు ఆడాల గణేష్



**ఇబ్రహీంపట్నం, జూలై 15 (సమ సమాజం):** రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో కుమ్మర సంఘం పెద్ద కాసుల పోశయ్య మరణించిన విషయం తెలుసుకొన్న రంగారెడ్డి జిల్లా కుమ్మర సంగం యూత్ అధ్యక్షులు ఆడాల గణేష్ మృతుని కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తూ మరణించిన వారి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం చేశారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ, కుమ్మర సంఘానికి అనేక విధాలుగా తన సహాయ సహకారాలు అందించిన వ్యక్తి మరణించడం తమ సంఘానికి తీరని లోటని దుఃఖాన్ని వ్యక్తం చేశారు. ఆయన కుమ్మర సంఘానికి చేసిన సేవలను స్మరించుకుంటూ ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుమ్మర సంఘ పేద ప్రజలకు ఎటువంటి ముప్పు వచ్చినా ముందుండి నేను నడుస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎగిరిశెట్టి వీరయ్య, కులవృత్తుల అధ్యక్షులు మోహన్ కుమార్, నియోజకవర్గ అధ్యక్షులు కాసుల పాండు, ప్రధాన కార్యదర్శి యాదగిరి, ఇబ్రహీంపట్నం టౌన్ అధ్యక్షులు బసవపురం మల్లేష్, ఉపాధ్యక్షులు బత్తుల లక్ష్మణ్, ఆరుట్ల గ్రామ కుమ్మర సంఘం పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## ఐఐటీలో మద్రాస్ టాప్

- ఓవరాల్ గా అన్ని విభాగాల్లో తొలిస్థానంలో నిలిచిన మద్రాస్
- రెండో స్థానలో ఢిల్లీ ఐఐటీ
- తొమ్మిదవ స్థానంలో హైదరాబాద్ ఐఐటీ
- నేషనల్ ఇన్స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ విడుదల
- మొత్తం 11 కేటగిరీల్లో ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్ ప్రకటన

**న్యూఢిల్లీ, జూలై 15 (సమ సమాజం):** నేషనల్ ఇన్స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్)ను విడుదల చేశారు కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్. అధికారిక వెబ్ సైట్ లో ర్యాకింగ్ సంబంధిత విషయాలను వెల్లడించారు. మొత్తం 11 కేటగిరీల్లో ఎన్ఐఆర్ఎఫ్ ఇండియా ర్యాంకింగ్స్ ప్రకటించారు. విశ్వవిద్యాయాలం, నిర్వహణ, కళాశాల, ఫార్మసీ, మెడికల్, ఇంజనీరింగ్, ఆర్కిటెక్చర్, లా, రిసెర్చ్, డెంటల్ కు సంబంధించిన విద్యాసంస్థలు ఉన్నాయి. టీచింగ్, లర్నింగ్ అండ్ రిసోర్సెస్, రీసెర్చ్ అండ్ ప్రొఫెషనల్ ప్రాక్టీస్, గ్యాడ్యుయేషన్ అవుట్ కమ్, ఔట్ రీచ్, ఇన్‌క్లూసివిటీ, పర్సెప్షన్ ఇలా ఐదు అంశాల కింద విద్యాసంస్థలకు మార్కులు కేటాయించి ర్యాంకులు ఇస్తారు. ఓవరాల్ గా అన్ని విభాగాల్లో తీసుకుంటే ఐఐటీ మద్రాస్ తొలిస్థానంలో నిలిచింది. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్ 2022: ఇంజనీరింగ్ విభాగం ర్యాంకింగ్స్ వరసగా.. 1)ఐఐటీ మద్రాస్, 2) ఐఐటీ ఢిల్లీ, 3) ఐఐటీ బాంబే, 4) ఐఐటీ కాన్పూర్, 5) ఐఐటీ ఖరగ్ పూర్, 6) ఐఐటీ రూర్కీ, 7) ఐఐటీ గౌహతి, 8) ఎన్ఐటీ తిరుచిరాపల్లి, 9) ఐఐటీ హైదరాబాద్ 10) ఎన్ఐటీ సూరత్కల్ నిలిచాయి. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్ 2022: యూనివర్సిటీ ర్యాకింగ్స్: 1) ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ , బెంగళూర్, 2) జవహర్ లాల్ యూనివర్సిటీ, ఢిల్లీ 3) జామియా మిల్లియా ఇస్లామియా, ఢిల్లీ, 4)జాదవ్ పూర్ యూనివర్సిటీ, కోల్ కతా, 5) అమృత విశ్వవిద్యా పీఠం, కోయంబత్తూర్, 6) బనారస్ హిందూ యూనివర్సిటీ, వారణాసి, 7) మణిపాల్ అకాడమీ ఆఫ్ హైయర్ ఎడ్యుకేషన్, మణిపాల్, 8) కలకత్తా యూనివర్సిటీ, కోల్ కతా, 9) వెల్లూర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, వెల్లూర్, 10) యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్, హైదరాబాద్ ఉన్నాయి. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్ 2022: ఓవరాల్ ర్యాంకింగ్స్, 1) ఐఐటీ %--% మద్రాస్, 2) ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ , బెంగళూర్, 3) ఐఐటీ బాంబే, 4) ఐఐటీ ఢిల్లీ, 5) ఐఐటీ కాన్పూర్, 6) ఐఐటీ ఖరగ్ పూర్, 7) ఐఐటీ రూర్కీ, 8) ఐఐటీ గౌహతి, 9) ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్(ఎయిమ్స్), ఢిల్లీ, 10) జే ఎన్ యూ, ఢిల్లీ స్థానాల్లో నిలిచాయి. మేనేజ్మెంట్ విభాగంలో మొదటిస్థానంలో ఐఐఎం అహ్మదాబాద్, రెండోస్థానంలో ఐఐఎం బెంగళూరు, మూడోస్థానంలో ఐఐఎం కోల్‌కత్తా, ఫార్మసీ కేటగిరీలో మొదటిస్థానంలో జామియా %--% న్యూఢిల్లీ, రెండోస్థానంలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్, హైదరాబాద్, మూడోస్థానంలో పంజాబ్ యూనివర్సిటీ, చండీగఢ్, టాప్ 3 కాలేజీల కేటగిరీలో మొదటిస్థానంలో మిరిండా కాలేజి, న్యూఢిల్లీ, రెండో స్థానంలో హిందూ కాలేజి, న్యూఢిల్లీ, మూడోస్థానంలో ప్రెసిడెన్సీ కాలేజి, చెన్నై, ఆర్కిటెక్చర్ విభాగంలో మొదటిస్థానంలో ఐఐటీ రూర్కీ, రెండోస్థానంలో ఎన్ఐటీ కాలికట్, మూడోస్థానంలో ఐఐటీ, ఖరగ్‌పూర్, లా విభాగంలో మొదటిస్థానంలో నేషనల్ లా స్కూల్ ఆఫ్ ఇండియా, బెంగళూరు, రెండోస్థానంలో నేషనల్ లా యూనివర్సిటీ న్యూఢిల్లీ, మూడోస్థానంలో సింబియాసిస్ లా స్కూల్, పూణే మెడికల్ కేటగిరీలో మొదటిస్థానంలో ఎయిమ్స్, న్యూఢిల్లీ, రెండోస్థానంలో పీజీఐఎంఐ, చండీగఢ్, మూడోస్థానంలో క్రిస్టియన్ మెడికల్ కాలేజి, వేలూర్ (తమిళనాడు) డెంటల్ కేటగిరీలో సవితా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ సైన్సెస్ చెన్నై, రెండోస్థానంలో మణిపాల్ కాలేజి ఆఫ్ డెంటల్ సైన్సెస్ మణిపాల్, మూడోస్థానంలో డా. డీవైపాటిల్ విద్యాపీఠ్, పూణే, రీసెర్చ్ కేటగిరీలో మొదటిస్థానంలో ఐఐఎస్సీ బెంగళూరు, రెండోస్థానంలో ఐఐటీ మద్రాస్, మూడోస్థానంలో ఐఐటీ ఢిల్లీ క్నసాగుతునాయి.

## దేశ రాజధాని ఢిల్లీలో దారుణం

### మహిళకు 14 సార్లు అబార్షన్ ○ తట్టుకోలేక మహిళ ఆత్మహత్య

**న్యూఢిల్లీ, జులై 15(సమ సమాజం):** దేశ రాజధాని ఢిల్లీలో దారుణం వెలుగు చూసింది. నయవంచనకు మారుపేరుగా మారిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్.. తన ప్రియురాలిని ప్రాణాలను బలిగొన్నాడు. ప్రేమ పెళ్లి పేరుతో ఓ మహిళకు టెకీ దగ్గరయ్యాడు. ఆ మహిళ 14 సార్లు గర్భం దాల్చగా.. 14 సార్లు అబార్షన్ చేయించాడు. పెళ్లి చేసుకుంటానని సాకులు చెప్పి మహిళను నమ్మిస్తూ వచ్చాడు. అయితే పెళ్లి చేసుకుందాం అని ప్రియురాలు అడిగిన ప్రతీసారి నిరాకరిస్తూ వచ్చాడు. ప్రియుడు నిరాకరించడాన్ని తట్టుకోలేకపోయిన సదరు మహిళ.. వేరే దారి లేక ఆత్మహత్య చేసుకుంది. జులై 5న ఢిల్లీలోని జత్‌పూర్ ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. "జైత్‌పూర్‌లో ఓ మహిళ ఆత్మహత్యకు సంబంధించి జూలై 5న పోలీసులకు పిసిఆర్ కాల్ వచ్చింది. ఓ ఇంట్లో మహిళ ఉరి వేసుకుందని సమాచాం అందింది. వెంటనే ఆ ప్రదేశానికి పోలీసు బృందాన్ని పంపించారు. మహిళను ఎయిమ్స్‌కు తరలించగా, ఆమె చనిపోయిందని వైద్యులు ప్రకటించారని" డిసిపి ఈషా పాండే తెలిపారు. శవపరీక్ష అనంతరం బాధితురాలి మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించారు. ప్రియుడి మోసాన్ని తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడిందని పోలీసులు తెలిపారు. ఘటనా స్థలంలో లభించిన సూసైడ్ నోట్ ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి సహజీవనం చేసి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ నమ్మక ద్రోహం చేశాడని బాధిత మహిళ తన సూసైడ్ నోట్‌లో పేర్కొంది. మహిళను ఆత్మహత్యకు ప్రేరేపించడంతో పాటు లైంగిక దాడికి పాల్పడిన నిందితుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితురాలు గత 8 ఏళ్లుగా భర్త నుంచి మహిళ వేరుగా ఉంటోందని దర్యాప్తులో వెల్లడైందని పోలీసులు చెప్పారు.

## మంగళసూత్రం తీసేయడం మానసిక క్రూరత్వం

### మద్రాస్ హైకోర్టు సంచలన వ్యాఖ్యలు



**మద్రాస్, జులై 15(సమ సమాజం):** మంగళసూత్రం ధరించే విషయంపై మద్రాస్ హైకోర్టు సంచలన వ్యాఖ్యలు చేసింది. అగ్నిసాక్షిగా పెళ్లాడిన భర్త బతికుండగా భార్య మంగళ సూత్రాన్ని తీసివేయడం మానసిక క్రూరత్వానికి నిదర్శనమని వ్యాఖ్యానించింది. " మంగళసూత్రం వైవాహిక జీవితానికి ప్రతీక. భర్త మరణించిన తర్వాత మాత్రమే దానిని తొలగించాలి. విడిపోవాలనుకున్న భార్య ముందుగా తాళిని తీసివేయడం అంటే భర్తను మానసిక క్రూరత్వానికి గురిచేసినట్లే అవుతుంది. " - మద్రాస్ హైకోర్టు ఓ విడాకుల కేసు విచారణలో భాగంగా మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ వీఎం వేలుమణి, జస్టిస్ ఎస్ సౌంథర్‌లతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. తమిళనాడు ఈరోడ్‌కు చెందిన శివకుమార్ తనకు విడాకులు ఇవ్వడాన్ని నిరాకరిస్తూ స్థానిక ఫ్యామిలీ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని మద్రాస్ హైకోర్టులో అప్పీల్ చేశారు. ఈ మేరకు 2016 జూన్ 15 నాటి ఉత్తర్వులను రద్దు చేయాలని కోరారు. ఆయన ఓ వైద్య కళాశాలలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఈ కేసు విచారణలో భర్త నుంచి విడిపోయే సమయంలో ఆమె తన తాళి గొలుసును తొలగించినట్లు కోర్టు ముందు అంగీకరించింది. దీంతో మన దేశంలో జరిగే వివాహ వేడుకలలో తాళి కట్టడం అనేది ఒక ముఖ్యమైన ఆచారమని కోర్టు పేర్కొంది. ఆయన అప్పీల్‌ను అనుమతించింది. " ఆమె తన తాళిని తొలగించినట్లు దాన్ని బ్యాంకు లాకరులో ఉంచినట్లు స్వయంగా అంగీకరించింది. ఏ హిందూ వివాహిత తన భర్త జీవించి ఉన్న సమయంలో ఏ సమయంలోనైనా తాళిని తీయదు. ఇది అందరికీ తెలిసిన విషయమే. స్త్రీ మెడలో తాళి అనేది పవిత్రమైన విషయం. ఇది వైవాహిక జీవితం కొనసాగింపును సూచిస్తుంది. అది భర్త మరణించిన తర్వాత మాత్రమే తొలగించాలి. భార్య తాళిని తొలగించడం వల్ల భర్తకు మానసిక క్షోభ కలుగుతుందని హైకోర్టు తెలిపింది.

# కేంద్ర విధానాలపై ఇక ప్రత్యక్ష పోరు



(మొదటి పేజి తరువాయి) దేశంలో ప్రమాదంలో పడుతున్న ఫెడరల్, సెక్యులర్ ప్రజాస్వామిక విలువలను కాపాడాలనే తన ప్రయత్నాలకు కేసీఆర్ మరింత పదును పెట్టారు. ఆర్థిక సంక్షోభంలోకి దేశాన్ని నెట్టివేస్తున్న కేంద్ర వైఖరిని తేటతెల్లం చేసేందుకు కేసీఆర్ కసరత్తు చేస్తున్నారు. పార్లమెంట్ సమావేశాలను వేదికగా చేసుకుని బీజేపీ ప్రభుత్వంపై పోరాటం చేయనున్నారు. బీజేపీ ప్రభుత్వ అప్రజాస్వామిక దమననీతిని తీవ్రంగా ఖండిస్తూ.. దేశవ్యాప్త నిరసనలతో కేంద్రంపై పోరుకు సీఎం కేసీఆర్ సన్నద్ధమవుతున్నారు. ఈ నెల 18 నుంచి ప్రారంభ కానున్న పార్లమెంటు సమావేశాల నేపథ్యంలోఎంపీలతో శనివారం మధ్యాహ్నం ప్రగతిభవన్ లో సీఎం కేసీఆర్ సమావేశం కానున్నారు. ఉభయ సభల్లో అనుసరించాల్సిన విధివిధానాల పై దిశానిర్దేశర చేసేందుకు.. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాల పై పోరాడాలని ఎంపీలకు కేసీఆర్ సూచించనున్నారు. పార్లమెంటు వేదికగా పోరాటం చేయాలని ఎంపీలకు సీఎం కేసీఆర్ దిశానిర్దేశం చేయనున్నారు. అభివృద్ధిలో దూసుకుపోతున్న తెలంగాణ రాష్ట్రాన్ని ప్రోత్సహించకుండా ఆర్థింకగా అనేక రకాలుగా ఇబ్బందులకు గురిచేయాలని కేంద్రం కుటిల ప్రయత్నాలు చేస్తుందన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను అద్దం పడుతూ ఉభయ సభల్లో బీజేపీ నిలదీయాలని ఎంపీలకు కేసీఆర్ సూచించనున్నారు. సాగునీరు, వ్యవసాయ అనుబంధ రంగాల్లో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన విప్లవాత్మక మార్పులతో అనతికాలంలోనే అంచనాలను మించి.. ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ దేశంలోనే ముందంజలో నిలిచిందన్నారు. తెలంగాణ రైతులు పండించిన ధాన్యాన్ని కొనకుండా, రైతులను మిల్లర్లను ప్రభుత్వాన్ని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్న కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాల పై పోరాడాలని ఎంపీలకు సీఎం పిలుపునివ్వనున్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పటిష్టంగా అమలు చేస్తున్న తెలంగాణ విషయంలో కేంద్రం పొంతనలేని ద్వంద్వం వైఖరిని, దుర్మార్గ విధానాన్ని నిలదీయాలని సిఎం నిర్ణయించారు. తెలంగాణ లో గ్రామీణ ఉపాధి హామీ పథకం గొప్పగా అమలు జరుగుతున్న తీరు గురించి, రాష్ట్రంలో జరుగుతున్న సోషల్ ఆడిట్ గురించి ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం పలుమార్లు ప్రశంసించింది.. అవార్డులు ఇచ్చింది. కానీ కేంద్ర ప్రభుత్వం మాట మార్చి దానికి విరుద్ధంగా వ్యవహరిస్తుందన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలులో ఉద్దేశపూర్వకంగా ఇబ్బందులకు గురిచేయాలనే కేంద్రం కుట్రలు, రూపాయి పతనం పై ఉభయ సభల సాక్షిగా నిలదీయాలని ఎంపీలకు సూచించనున్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న అప్రజాస్వామిక ..ఆధిపత్యధోరణి వల్ల దేశంలో రోజు రోజుకూ ప్రజాస్వామిక విలువలు దిగజారుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయన్నారు. రాజ్యాంగం పొందుపరిచిన ఫెడరల్ స్ఫూర్తికి, సెక్యులర్ జీవన విధానానికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న దుర్మార్గ విధానాలు గొడ్డలిపెట్టుగా మారుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ అప్రజాస్వామిక విధానాలను నిరసిస్తూ పార్లమెంటు వేదికగా దేశ ప్రజల ఆకాంక్షలను చాటేలా గొంతు విప్పాలని ఎంపీలకు సీఎం కేసీఆర్ దిశానిర్దేశంచేయనున్నారు. కేంద్రం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై టిఆర్ఎస్ పార్టీ చేస్తున్న పోరాటంలో భాగంగా కలిసివచ్చే ఇతర రాష్ట్రాలవిపక్ష ఎంపీలను కూడా కలుపుకొని, కేంద్రం మెడలు వంచి ప్రజాస్వామిక విలువలు కాపాడాల్సి వున్నదిని సీఎం అభిప్రాయపడ్డారు. పార్లమెంటు ఉభయ సభల్లో కేంద్ర ప్రభుత్వ అసంబద్ధ విధానాలను నిలదీస్తూ గళం విప్పాలని ముఖ్యమంత్రి నేటి సమావేశంలో ఎంపీలకు పిలుపునివ్వనున్నారు.

## తెలుగు రాష్ట్రాల్లో అల్పపీడనం ప్రభావం

### ఏపీలో 3 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ● తెలంగాణలో అక్కడక్కడ భారీ వర్షాలు

**హైదరాబాద్, జూలై 15 (సమ సమాజం):** నైరుతి రుతుపవనాలు, అల్పపీడనం ప్రభావంతో తెలుగు రాష్ట్రాలతో పాటు పలు రాష్ట్రాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఒడిశా తీరంలో ఏర్పడిన అల్పపీడనం మరింత బలపడింది. దక్షిణ కోస్తా ఒడిశా దాని పరిసర ప్రాంతాల్లో అల్పపీడనం తాజాగా ఉత్తర కోస్తా ఒడిశా దాని పరిసర ప్రాంతాల్లో అల్పపీడనంగా మారింది. అనుబంధ ఉపరిత ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 7.6 కిలోమీటర్ల పైన విస్తరించి ఎత్తుకు వెళ్లే కొద్దీ నైరుతి వైపు వంగి ఉంటుందని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. రుతుపవన ద్రోణి జైసల్మీర్, కోటా, గుణ, సాగర్, జబల్ పూర్, పెండ్రా రోడ్డు, అల్పపీడన ప్రాంతం ఉత్తర ఒడిశా దాని పరిసర ప్రాంతాల మీదుగా ఆగ్నేయ దిశగా తూర్పు మధ్య బంగాళాఖాతం వరకు వెళ్లి సగటు సముద్ర మట్టానికి 1.5 కిలో మీటర్ల ఎత్తులో విస్తరించి ఉంది. తూర్పు పడమర గాలుల కోత ఉత్తర భారత ద్వీపకల్పమైన 19 డిగ్రీ ఉత్తర అక్షాంశం వెంట సగటు సముద్ర మట్టానికి 3.1 కి.మీ, 7.6 కి.మీ మధ్య విస్తరించి ఉంది. ఒడిశా తీరంలో అల్పపీడనం బలపడటంతో ఉత్తర కోస్తాంధ్ర, యానాంలో వర్షాలు కురవనున్నాయి. నేటి నుంచి మరో రెండు రోజులపాటు ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నంలో భారీ వర్షాలు కురవనున్నాయని ఈ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది అమరావతి వాతావరణ కేంద్రం. తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల్లో పలు చోట్ల మోస్తరు వర్షాలు కురవనున్నాయి. ఒకట్రెండు చోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని ఈ ప్రాంతాల వారు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పంటలు వేసే పరిస్థితి కనిపించడం లేదు. దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లోనూ అల్పపీడనం ప్రభావం తక్కువగానే ఉంది. గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో నేటి నుంచి 2 రోజులపాటు తేలికపాటి జల్లుల నుంచి ఓ మోస్తరు వర్షాలు కురవనున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. చిత్తూరు, వైఎస్సార్ కడప, అనంతపురం, కర్నూలు జిల్లాల్లో అక్కడక్కడ రెండు రోజులు తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయి. వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. హెచ్చరిక: భారీ వర్షం కురుస్తున్న సమయంలో ఇళ్ల నుంచి బయటకు రావొద్దని ప్రజలకు హెచ్చరించారు. వర్షపు నీళ్లు నిలిచిపోయే చోట ఉండకూడదు. వైర్లు, విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలని సూచించారు. అరటి తోటలకు నష్టం కలిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. చెట్ల కింద నిల్చోకుండా సురక్షిత మైన చోట ఉండాలని ప్రజలను హెచ్చరించారు. తెలంగాణలో వారం రోజుల నుంచి పలు జిల్లాల్లో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. గురువారం వర్షాలు తగ్గుముఖం పట్టాయి. నేడు సైతం రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని కొన్ని జిల్లాలకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం ఎల్లో అలర్ట్ జారీ చేసింది. జయశంకర్ భూపాలపల్లి మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్ అర్బన్, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ నేటి నుంచి రెండు రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఎల్లో అలర్ట్ జారీ చేశారు. మిగతా ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

## టీఆర్ఎస్ పీఠాలు కదిలిపోతున్నాయి

### మండిపడ్డ మంత్రికిషన్ రెడ్డి



**హైదరాబాద్, జూలై 15 (సమ సమాజం):** రాష్ట్రంలో టీఆర్ఎస్ పీఠాలు కదిలిపోతున్నాయి కాబట్టే టీఆర్ఎస్ పార్టీ నాయకులు బీజేపీపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని కేంద్ర పర్యాటకశాఖ మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు.తెలంగాణ ప్రజలపై కేసీఆర్ నియంతృత్వ పాలన సాగిస్తున్నారని కిషన్ రెడ్డి కేసీఆర్ పై ఫైర్ అయ్యారు.పార్లమెంట్ ఉన్నది యుద్ధాలు చేసేందుకు కాదనీ, ప్రజాసమస్యలపై చర్చించేందుకన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు.రాష్ట్ర ప్రభుత్వంతో అగ్రిమెంట్ చేసుకున్న ప్రకారం వరి కొనుగోలుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు.రాష్ట్ర ప్రభుత్వ నివేదిక ఆధారంగా కేంద్ర బృందాలు పర్యటిస్తాయని చెప్పారు.వారి రిపోర్టుల ఆధారంగా వరద సాయం అందిస్తామని అన్నారు.

## డొనాల్డ్ ట్రంప్ మాజీ భార్య ఇవానా ట్రంప్ మృతి

### మాజీభార్య మృతికి ట్రంప్ సంతాపం ప్రకటన



**న్యూయార్క్, జూలై 15 (సమ సమాజం):** అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాజీ భార్య ఇవానా ట్రంప్ కన్నుమూశారు.ఇవానా ట్రంప్ వయసు 73 సంవత్సరాలు. మాన్‌హట్టన్‌లోని 10 ఇ. 64వ సెయింట్‌లోని తన ఇంట్లో మధ్యాహ్నం 12:40 గంటలకు మరణించింది. ఇవానా ట్రంప్ గుండెపోటుకు గురైందని వైద్యులు చెప్పారు. ఇవానా ట్రంప్ డోనాల్డ్ జూనియర్, ఇవాంకా, ఎరిక్ ట్రంప్‌ల తల్లి. మా తల్లి ఒక అద్భుతమైన మహిళ. వ్యాపారంలో శక్తివంతురాలు.ప్రపంచ స్థాయి అథ్లెట్, ప్రకాశవంతమైన అందం, శ్రద్ధగల తల్లి, స్నేహితురాలు అని ఎరిక్ ట్రంప్ ఆమె మరణాన్ని ప్రకటిస్తూ ఒక ప్రకటనలో తెలిపారు.న్యూయార్క్ నగరంలోని తన ఇంటిలో ఇవానా ట్రంప్ మరణించారని తెలియజేయడానికి నేను చాలా బాధపడుతున్నాను అని మాజీ అధ్యక్షుడు ట్రంప్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ అయిన ట్రూత్ సోషల్‌లో రాశారు. ఇవానా ట్రంప్ అందమైన, అద్భుతమైన మహిళ.ఆమె గొప్ప, స్ఫూర్తిదాయకమైన జీవితాన్ని గడిపారని ట్రంప్ అన్నారు. ఈ జంట విడాకుల తరువాత ఇవానా ఓప్రా విన్‌ఫ్రేతో 1992 ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఇకపై పురుషులను నాపై ఆధిపత్యం చెలాయించడానికి నేను అనుమతించనని వ్యాఖ్యానించారు. డొనాల్డ్ ట్రంప్ విడాకుల తర్వాత ఆమె రెండుసార్లు పెళ్లి చేసుకుంది. 1995లో ఇటాలియన్ వ్యాపారవేత్త రికార్డో మజ్జుచెల్లి భర్త. ఆమె రెండు సంవత్సరాల తర్వాత విడాకులు తీసుకుంది 2008లో మళ్లీ రోసానో రూబికొండిలో ఇటాలియన్ మోడల్, నటుడు అయిన రూబికొండిని వివాహమాడారు. ఈ జంట మార్-ఎ-లాగోలో వివాహం చేసుకున్నారు. వారు ఒక సంవత్సరం తర్వాత విడాకులు తీసుకున్నారు.

## భార్యపై అనుమానంతో ప్రైవేట్ పార్ట్ లో కత్తితో పొడిచి హత్య చేసిన భర్త

**హైదరాబాద్, జూలై 15 (సమ సమాజం):** కులుసుంపుర పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం చోటు చేసుకుంది. అనుమానంతో భార్యను హతమార్చాడు ఓ భర్త. వివరాల్లోకి వెళితే.. కులుసుంపుర పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ టిఫిన్ సెంటర్‌లో పని చేస్తున్న సరిత యాదవ్ అనే మహిళను ఆమె భర్త సంతోష్ తన ఇంట్లో ప్రైవేట్ పార్ట్ లో కత్తితో పొడిచి హత్య చేశాడు. సంతోష్ తన బార్య పై అనుమానంతోనే హత్య చేసినట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అడ్డువచ్చిన మృతురాలు బంధువు పై కూడా కత్తితో దాడికి పాల్పడ్డాడు. గాయపడ్డ వ్యక్తిని ఉస్మానియా ఆసుపత్రి కీ తరలించారు.సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు, క్లూస్ టీమ్ దర్యాప్తు చేపడుతున్నారు.మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రి మార్చురీకి తరలించరు. ప్రస్తుతం పోలీసుల అదుపులో ఉన్నాడు నిందితుడు సంతోష్. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు హత్య కేసుగా నమోదు చేసుకుని కులుసుంపుర పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు

## ఆపరేషన్ ముస్కాన్‌లో 159 మంది చిన్నారులకు విముక్తి

**హైదరాబాద్, జూలై 15 (సమ సమాజం):** ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా రోడ్లపై భిక్షాటన చేస్తున్న చిన్నారులతోపాటు పరిశ్రమలలో పనిచేస్తున్న వారిని గుర్తించి హైదరాబాద్ పోలీసులు కాపాడారు. కమిషనరేట్ పరిధిలో పోలీసు అధికారులతోపాటు, కార్మికశాఖ, శిశు సంక్షేమశాఖ, చైల్డ్‌లైన్ అధికారులతో కలిసి సంయుక్తంగా దాడులు నిర్వహించారు. నగరంలోని ప్రధాన కూడళ్లతోపాటు, పని ప్రదేశాల్లో దాడులు నిర్వహించి 159 మంది పిల్లలను కాపాడారు. తెలంగాణ. ఏపీ, ఒడిశా, జార్ఖండ్, కర్ణాటక, మహారాష్ట్రలకు చెందిన 135మంది బాలురు, 24 మంది బాలికలున్నారు. కాపాడిన వారిలో కొందరిని బాలవిహార్‌కు, చైల్డ్‌హోమ్, స్టేట్ హోంకు తరలించగా, మరి కొందరిని వారి సంబంధీకులకు అప్పగించారు. పిల్లలను పనుల్లో పెట్టుకున్న యజమానులపై కేసులు నమోదు చేసి, జరిమానా విధించామని అధికారులు తెలిపారు.




# చలన చిత్రం

## చిరంజీవి ఇంట్లో సినిమా చూసిన స్టార్ సెలబ్రిటీలు



బాలీవుడ్ స్టార్ హీరో అమీర్ ఖాన్ నటిస్తోన్న చిత్రం లాల్ సింగ్ ఛద్దా ). అద్వైత్ చందన్ డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీ ఆగస్టు 11న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. యువ హీరో నాగచైతన్య ఈ చిత్రంలో కీలక పాత్రలో నటిస్తున్నాడు. ఈ నేపథ్యంలో అమీర్ ఖాన్ టీం ప్రమోషన్స్ లో బిజీగా ఉంది. ఇందులో భాగంగా హైదరాబాద్‌లో స్పెషల్ ప్రివ్యూ వేయించాడు అమీర్ ఖాన్. ఈ ప్రీమియర్‌కు టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవి నివాసం వేదికైంది. అమీర్ ఖాన్, చిరంజీవి మంచి స్నేహితులని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. అమీర్ ఖాన్ ఈ సినిమా ఫస్ట్ ప్రివ్యూ షోను చిరంజీవి కోసం వేసినట్టు బీటౌన్ సర్కిల్ టాక్. ఈ స్పెషల్ షోకు అమీర్‌ఖాన్, చిరుతోపాటు స్టార్ డైరెక్టర్లు రాజమౌళి, సుకుమార్, నాగార్జున, నాగచైతన్య హాజరయ్యారు. అమీర్‌ఖాన్ ప్రొడక్షన్స్, వయాకామ్ 18 స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టులో కరీనా కపూర్ ఫీ మేల్ లీడ్ రోల్ పోషిస్తోంది. హాలీవుడ్ సినిమా ఫారెస్ట్ గంప్‌కు రీమేక్‌గా వస్తోంది లాల్ సింగ్ ఛద్దా. 2018లో థగ్స్ ఆఫ్ హిందూస్థాన్ సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చాడు అమీర్ ఖాన్. నాలుగేళ్ల తర్వాత వస్తున్న సినిమా కావడంతో అంచనాలు భారీగా ఉన్నాయి.

## ఎవరన్నా సినిమా ఛాన్స్ ఇవ్వండ్రా బాబు



టాలీవుడ్ లో అవకాశాలు లేకపోవడంతో శ్రీరెడ్డికి పిచ్చి ఎక్కినట్టు వుంది.కొన్ని రోజులు తమిళ ఇండస్ట్రీ కి వెళ్లి హల్చల్ చేసింది. తర్వాత అక్కడ నుండి సర్దుకొని యూట్యూబ్ చానల్స్ మీద పడింది. చాలా ఇంటర్వ్యూల్లో పాల్గొని అన్నీ చూపించినా ఎవడు పట్టించు కోలేదు. ఇక లాభం లేదని టైటు జాకెట్స్ తో వంటలు మొదలు పెట్టింది.యూట్యూబ్ చానల్ లో వంటల ప్రోగ్రామ్స్ చేస్తూ అందాల విందు కూడా వడ్డిస్తోంది. చేపలు,మేకలు,రొయ్యలు అన్నీ వండుతూ తన గ్లామర్ చూపిస్తోంది. తాజాగా మామిడితోటలో మెత్తటి నూడుల్స్ వంటకంతో సందడి చేస్తోంది. జాకెట్ లోని అందాలు తన్నుకొని వస్తున్నాయి.డబుల్ మీనింగ్ డైలాగులు ల తో యూత్ ను పిచ్చెక్కిస్తుంది..ఇంకా ఖాళీ గా వుండి లైవ్ లు చేస్తూ టాలీవుడ్ నటీనటులపై విమర్శలు కొనసాగిస్తోంది. రీసెంట్ గా సీనియర్ నటుడు నరేష్, పవిత్ర లోకేష్ గురించి దారుణం గా మాట్లాడింది. మెగా ఫ్యామిలీపై మరోసారి ఆరోపణలు చేసింది. ఈమెకు అవకాశాలు లేక మెంటల్ అయినట్లు సోషల్ మీడియాలో లో మాట్లాడు కుంటున్నారు. శ్రీరెడ్డి ఫ్యామిలీ మంచి పూజలు చేసే ఫ్యామిలీ ఈమె ఏమో ఇలా వయ్యారాలు పోతోంది.బాబు ఎవరైనా సినిమా ఛాన్స్ ఇచ్చి పుణ్యం కట్టుకోండి లేకుంటే ఇంకెన్ని ఘోరాలు చూడాలో.



## ఓటీటీలోకి రానున్న ది వారియర్

టాలీవుడ్ ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని, యంగ్ బ్యూటీ కృతి శెట్టి జంటగా నటించిన తాజా చిత్రం ది వారియర్ . కోలీవుడ్ డైరెక్టర్ ఎన్.లింగుసామి తెరకెక్కించిన ఈ చిత్రంలో ఆది పినిశెట్టి విలన్‌గా నటిస్తే అక్షర గౌడ్, నదియ తదితరులు కీలక పాత్రలను పోషించారు. దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందించాడు. పవన్ కుమార్ సమర్పణలో శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ పతాకంపై శ్రీనివాసా చిట్టూరి నిర్మించిన ఈ చిత్రం.. నిన్ననే గ్రాండ్‌గా తెలుగు, తమిళ భాషల్లో విడుదలై పాజిటివ్ టాక్ సొంతం చేసుకుంది. కర్నూలులో డీఎస్పీగా చార్జ్ తీసుకున్న సత్య అనే ఆఫీసర్ లోకల్ గూండా గురుని ఎలా ఎదుర్కొన్నాడనేది ఈ సినిమా ప్రధాన కథ. రొటీన్ కథే అయినప్పటికీ.. డైరెక్టర్ లింగుసామి ఓ కొత్త పాయింట్ యాడ్ చేశాడు.అదేంటంటే.. డాక్టర్ అయిన హీరో పోలీస్‌గా మారడం. ఫస్టాఫ్‌లో డాక్టర్‌గా, సెకెండాఫ్‌లో పోలీస్‌గా రామ్ అదరగొట్టేశాడు. రామ్, ఆది పినిశెట్టిల నటన, కృతి శెట్టి గ్లామర్ షో, యాక్షన్ ఎపిసోడ్స్ ప్రేక్షకులను బాగా అలరిస్తాయి.భారీ ట్విస్టులు లేకపోయినా, బోర్ కొట్టించకుండా కథను నడిపించడంతో లింగుసామి బాగానే సక్సెస్ అయ్యాడు. ఇదిలా ఉంటే.. ది వారియర్ సినిమా తెలుగు, తమిళ్ డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ డిస్నీ ప్లస్ హాట్‌స్టార్ సొంతం చేసుకుంది. అందుకుగానూ సదరు సంస్థ రూ. 15 కోట్లు చెల్లించిందని తాజాగా ఓ టాక్ బయటకు వచ్చింది. ఇదే నిజమైతే ది వారియర్ ఓటీటీ రైట్స్ భారీ ధర పలికినట్టే అని చెప్పాలి. ఇక మరి ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఎలాంటి కలెక్షన్స్ రాబడుతుందో చూడాల్సి ఉంది.

## రెండో పెళ్లిపై క్లారిటీ ఇచ్చిన నోయల్.!



సింగర్ నోయల్ తెలుగునాట బాగా పాపులర్. సింగర్ మంచి ఫేం ఉన్న నోయల్ చేసే షోలకు మంచి క్రేజ్ ఉంటుంది. నోయల్ పాడే పాటలు, పాప్ సాంగ్స్ కూడా అంతే పాపులర్.నటుడిగాను మంచి గుర్తింపే ఉన్న నోయల్ భీమవరం బుల్లోడు హీరోయిన్ ఎస్తేర్‌ను ప్రేమవివాహం చేసుకున్నాడు. అయితే యేడాదిలోపే మనస్పర్థలతో వీరిద్దరు విడిపోయారు. విడాకుల తర్వాత నోయల్ బిగ్‌బాస్ హౌస్‌లోకి ఎంట్రీ ఇచ్చి మధ్యలోనే నిష్క్రమించినా మరింత గుర్తింపు తెచ్చుకున్నాడు. విడాకుల తర్వాత నోయల్ ఎప్పుడూ తన మాజీ భార్య ఎస్తేర్ గురించి ఎక్కడా నెగిటివ్‌గా కామెంట్లు చేయలేదు. అయితే ఎస్తేర్ మాత్రం నోయల్‌పై ఘాటుగానే కామెంట్లు చేసింది. అతడు అన్నీ అబద్ధాలే చెపుతాడని.. మనం వేసే ఒక ప్రశ్నకే నోయల్ రకరకాల ఆన్సర్లు చెపుతాడని. పెళ్లయ్యాక ఆరు నెలల తర్వాత తనకు అతడితో జీవితాంతం కలిసి ఉండలేనన్న విషయం అర్థమైందని.. అందుకే తాను విడిపోవాలని నిర్ణయించుకున్నానని కుండబద్దలు కొట్టేసింది. విడాకుల తర్వాత ఎవరి జీవితంలో వారు సెటిల్ అయిపోయారు. ఎస్తేర్ సినిమాలు చేసుకుంటోంది. నోయల్ పాటలు పాడుకుంటూ.. నటుడిగా కొనసాగుతున్నాడు. ఈ క్రమంలోనే తాజా ఇంటర్వ్యూలో నోయల్ తన పర్సనల్ లైఫ్ గురించి ఎట్టకేలకు ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. తన మొదటి పెళ్లి గురించి మాట్లాడుతూ ఒక జంటకు పెళ్లి జరిగింది అంటే రెండు కుటుంబాలు ఎంతో ఎఫర్ట్ పెట్టాలి.. అయితే నా జీవితంలో నుంచి వెళ్లిపోయిన వారి గురించి తాను బాధపడను.. ప్రస్తుతం తాను ఎంతో హ్యాపీగా ఉన్నాను అని చెప్పారు. ఇక కొన్ని సంఘటనలు తనకు ఎప్పుడు అయినా గుర్తుకు వచ్చినా హ్యాపీగానే ఉంటానని. పరోక్షంగా తన మాజీ భార్య ఎస్తేర్‌ను టార్గెట్ చేశారు. ఇక తన రెండో పెళ్లి గురించి కూడా నోయల్ ఆసక్తికర వ్యాఖ్యలే చేశారు. చాలా మంది తన రెండో పెళ్లి గురించి అడుగుతున్నారు అని. ఓ సారి మన శరీరంలో ఏదైనా ఎముక విరిగితే మరోసారి విరగకుండా జాగ్రత్తలు తీసుకుంటాం. అలా రెండో పెళ్లి అనేది కాస్త ఆలస్యం అవుతుందని చెప్పారు. ప్రస్తుతం నోయల్ చేసిన కామెంట్లు బాగా వైరల్ అవుతున్నాయి.

## వారి మధ్య ఏ గొడవలు లేవు



తెలుగు చిత్ర పరిశ్రమలో డేరింగ్ అండ్ యాక్షన్ డైరెక్టర్గా గుర్తింపు తెచ్చుకున్న పూరీ జగన్నాథ్ గురించి ఎంత చెప్పినా తక్కువే అవుతుంది.ఇకపోతే ఇటీవల ఈయన ప్రముఖ హీరోయిన్ ఛార్మీ కౌర్ తో సహజీవనం చేస్తున్నాడని , ఇక తన భార్య లావణ్యకు విడాకులు ఇవ్వబోతున్నాడు అంటూ పెద్ద ఎత్తున వార్తలు ప్రచారం అవుతున్నాయి. అంతేకాదు పూరి జగన్నాథ్ కొడుకు ఆకాశపూరి ఇటీవల నటించిన చోర్ బజార్ సినిమా ఫ్రీ రిలీజ్ ఈవెంట్ కి కూడా పూరి జగన్నాథ్ రాకపోవడంతో బండ్ల గణేష్ ఈయనపై చెలరేగిపోయి ప్రకంపనలు సృష్టించాడు. ఇక బండ్ల గణేష్.. పూరి జగన్నాథ్ ను ఉద్దేశించి నా కొడుకు సినిమా రిలీజ్ ఈవెంట్ అయితే నేను లండన్ లో ఉన్నా సరే ఫ్లైట్ ఏసుకొని వచ్చేస్తాను.. నువ్వు ముంబై వీధుల్లో ఎవరితో కులుకుతున్నావో మాకు తెలుసు. బంగారు తల్లి దేవత లాంటి లావణ్యకు అన్యాయం చేయొద్దు అంటూ బండ్ల గణేష్ పూరీ జగన్నాథ్ పై రకరకాల కామెంట్లు చేశాడు. ఇకపోతే ఈ విషయాలను దృష్టిలో పెట్టుకొని పూరి జగన్నాథ్ కూడా తనదైన శైలిలో బండ్ల గణేష్ పై మాటల బాణాలు విసిరాడు. కానీ ఎవరేమనుకున్నా సరే పూరి జగన్నాథ్ లావణ్య కు అన్యాయం చేస్తున్నాడని వార్తలు కూడా పెద్ద ఎత్తున వైరల్ అయ్యాయి. ఇకపోతే ఆ తర్వాత ఎవరు కూడా ఈ విషయంపై క్లారిటీ ఇవ్వకపోవడం గమనార్హం. కానీ ఇటీవల లావణ్య , పూరి జగన్నాథ్ దంపతులకు దగ్గరుండి వివాహం జరిపించిన శంకరన్న క్లారిటీ ఇవ్వడం జరిగింది.

## పిల్లలను కనకుండా ఉండటమే అందరూ చేసే సాయం



అమెరికన్ తెలుగు అసోసియేషన్ నిర్వహించిన కార్యక్రమంలో సద్గురు పాల్గొనగా.. ఆ ఈవెంట్ ని మెగాస్టార్ కోడలు ఉపాసన కామినేని కొణిదెల హోస్ట్ చేసింది. దీనికి సంబంధించిన వీడియో యూట్యూబ్ లో చక్కర్లు కొడుతోంది. అయితే ఈ వీడియోను షేర్ చేస్తూ.. కొన్ని ఛానెల్స్ ఉపాసన, రామ్ చరణ్ పాపులేషన్ ను కంట్రోల్ చేయడానికి పిల్లలను కనడం లేదంటూ థంబ్ నెయిల్స్ పెట్టాయి. దీనిపై క్లారిటీ ఇస్తూ.. ఉపాసన తన ఇన్స్టాగ్రామ్ స్టోరీస్ లో ఓ పోస్ట్ పెట్టింది. అసలు విషయంలోకి వస్తే.. సద్గురుతో మాట్లాడుతూ.. ఎబిలిటీ టూ రీ ప్రొడ్యూస్(పిల్లలను కనడం) అనే విషయం గురించి ప్రస్తావించింది ఉపాసన. దానికి ఆయన పిల్లలను కనొద్దనే చెబుతానని అన్నారు. అదే నువ్ ఒకవేళ లేడీ టైగర్ అయి ఉంటే పిల్లలను కనమని చెప్పేవాడినని.. ఎందుకంటే అవి అంతరించిపోతున్నాయని అన్నారు. మనుషుల సంఖ్య అయితే చాలా ఎక్కువగా ఉందని.. అది అంతరించే జాతి కాదు కాబట్టి, పిల్లలను కనకుండా ఉండటమే అందరూ చేసే సాయమని అన్నారు. దీంతో ఉపాసన పిల్లలను కనడం లేదని కొన్ని వార్తలు పుట్టుకొచ్చాయి. రామ్ చరణ్ కూడా తన కెరీర్ లో బిజీగా ఉన్నారని.. ఈ జంట పిల్లలను వద్దనుకుంటుందని ప్రచారం జరుగుతోంది. దీనిపై స్పందించిన ఉపాసన.. 'ఓ మై గాడ్.. అందులో నిజం లేదు.. దయచేసి వీడియో మొత్తం చూడండి. నా కాపీ చూశాక మీకు అర్ధమవుతుంది' అంటూ చెప్పుకొచ్చింది. పెళ్లై పదేళ్లవుతున్నా రామ్ చరణ్–ఉపాసన పిల్లలను కనకపోవడంతో ఈ వార్తలు మరింత ఎక్కువగా వినిపిస్తున్నాయి.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8897334003 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in